94931 70689 www.rajadhanivartalu.com rajadhanivartalu rajadhaniv RNI No. APTEL 2015/ 66622 స్థాపితం : 2015 Postal Regd No: GTR/84/2016-18




# రాజధాని వార్తలు

Voice of Voiceless

| తేదీ | వారం | సహార్ (ఉదయం) | ఇఫ్తార్ (సాయంత్రం) |
|---|---|---|---|
| 21 | సోమ | 04 :13 | 07: 07 |
| 22 | మంగళ | 04 :12 | 07: 08 |
| 23 | బుధ | 04 :12 | 07: 08 |
| 24 | గురు | 04 :11 | 07: 09 |
| 25 | శుక్ర | 05 :11 | 07: 09 |



అమరావతి సంపుటి : 3 సంచిక 35, పేజీలు 4 వెల: రూ. 2.00 ఆంధ్రప్రదేశ్ ' రాజధాని' తొలి తెలుగు వార పత్రిక సోమవారం 21 - ఆదివారం 27 మే, 2018

వివరాలు 2లో...

లంకభూములు దళితులకే ఇవ్వాలి

వివరాలు 3లో...

ప్రిన్స్ వివాహానికి 'మైనా'కు ఆహ్వానం


వివరాలు 4లో...

త్యాగాలకు ఇదా గుర్తింపు ..

వివరాలు 4లో...

శ్రీదేవిది హత్యే

# శాసనసభలో చతికిలపడ్డ కర్ణాటక భాజపా



| | |
|---|---|
| మొత్తం సీట్లు | 222 |
| భాజపాకు | 104 |
| కాంగ్రెస్ | 78 |
| జేడీఎస్ | 37 |
| ఇతరులకు | 2 |

శాసనసభలో అతిపెద్ద పార్టీగా ఆవతరించినా- ప్రభుత్వ ఏర్పాటుకు అవసరమైన మెజారిటీ సాధించలేకపోవటంతో గవర్నర్ అధికారాన్ని ఉపయోగించుకోని ప్రభుత్వ ఏర్పాటుకు బాజపా చేసిన ప్రయత్ననాలు ఫలించలేదు. ఫలితంగా శాసనసభలో శనివారం విశ్వాస పరిక్షకు ముందే యడ్డూరప్ప ముఖ్యమంత్రి పదవికి రాజీనామా ప్రకటించారు.

శాసనసభలో మెజిక్ ఫిగర్‌కు 8 స్థానాలు మాత్రమే తక్కువగా ఉండటంతో ప్రభుత్వం ఏర్పాటు చేస్తే పార్టీ ఫిరాయింపులను సునాయాసంగా సాధించవచ్చున్న బాజపా నాయకుల కలలు కల్లలయ్యాయి. గోవా, మేఘాలయ, మణిపూర్ రాష్ట్రాల మాదిరిగానే సంఖ్యాబలం లేక పోయినా అధికార పీఠం







దక్కించుకోవచ్చున్న భాజపా అధినాయకత్వ ఎత్తుగడలను కాంగ్రెస్ పార్టీ చిత్తు చేయగలిగింది. కర్ణాటక శాసనసభ ఎన్నికల ఫలితాలు పూర్తిగా రాకముందే కాంగ్రెస్ నాయకురాలు సోనియాగాంధీ జేడీఎస్‌కు మద్దతు ప్రకటించి కర్ణాటకలో అధికారం చేజిక్కించుకుని దక్షిణాదిలో పాగావేయొచ్చున్న ప్రధాని మోదీ, భాజపా అధ్యక్షుడు అమిత్‌షాల ఆటలు సాగనివ్వలేదు. శాసనసభలో భాజపాకు అధిక స్థానాలు వచ్చినా పోలైన ఓట్లలో 1.9శాతం ఓట్లు కాంగ్రెస్‌కు అధికంగా లభించడం కూడా కలిసివచ్చింది. భాజపా ఎత్తుగడలను పార్టీ ఫిరాయింపుల యత్నాలను దేశ వ్యాప్తంగా భారీ ఎత్తున ప్రచారం చేయడంలో కాంగ్రెస్ సఫలీకృతమైంది. కాంగ్రెస్ జేడీఎస్‌ల కూటమికి శాసన సభలో మెజారిటీకి అవసరమైన స్థానాలు ఉన్నట్లు చెప్పినా కేంద్రం ఆదేశాలతో అతి పెద్ద పార్టీ అనే సాకుతో యడ్యూరప్పను ముఖ్యమంత్రిగా ప్రమాణస్వీకారం చేయించారు. బల నిరూపణకు ఆశ్చర్యకరంగా 15 రోజుల గడువిచ్చారు. ఈ చర్య దేశ వ్యాప్తంగా నిరసనలకు అవకాశమిచ్చింది. కర్ణాటక నిర్ణయంపై సుప్రీంకోర్టుకు వెళ్లి భాజపా అప్రజాస్వామిక చర్యలను దేశ ప్రజల దృష్టికి తీసుకురావడం కాంగ్రెస్‌కు మరొక విజయం.

దేశ వ్యాప్తంగా పెద్దయెత్తున జరిగిన ప్రచారంతో పార్టీ ఫిరాయింపులను ప్రోత్సహించడం భాజపా నాయకులను సాధ్యం కాలేదు. దేశంమొత్తాని ఆకర్షించిన కర్ణాటక శాసనసభ ఓటర్లు అన్ని పార్టీలను ఖంగుతినిపించారు. కర్ణాటక శాసనసభలో 222 స్థానాలకు జరిగిన ఎన్నికల్లో భాజపాకు 104, కాంగ్రెస్ 78, జేడీఎస్ 37, ఇతరులకు 2 స్థానాలు లభించాయి. భాజపా కంటే తక్కువస్థానాలే వచ్చినా పోలైన ఓట్లలో భాజపా కన్నా కాంగ్రెకు 7 లక్షలకుపైగా అధికంగా ఓట్లు లభించాయి.

## యడ్యూరప్ప రాజీనామా

**బెంగళూరు:** రాష్ట్ర ముఖ్యమంత్రిగా 3 రోజుల క్రితమే ప్రమాణస్వీకారం చేసిన బీఎస్ యడ్యూరప్ప తన పదవికి రాజీనామా చేశారు. బలపరీక్ష సందర్భంగా ఆయన సభను ఉద్దేశించి తొలుత మాట్లాడారు. రైతుల ఇక్కట్లు, సాదకబాధకాలు తాను

- మిగతా 2 లో

# రాజధానిలో సీఎం సుడిగాలి పర్యటన

**రాజధాని ప్రతినిధి, అమరావతి :** రాజధానిలో 24 వేల కోట్ల రూపాయలతో వివిధ రకాలుగా చేపడుతున్న పనులు ఆరు నెలల కాలంలో ఒక కొలిక్కి వచ్చి చేసిన పనులు కనిపిస్తాయని ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు తెలిపారు.

శనివారం అమరావతి రాజధానిలో చేపట్టిన రోడ్లు, ఉద్యోగుల క్వార్టర్లను ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు సుడిగాలి పర్యటన ద్వారా పరిశీలించారు. అనంతరం ముఖ్యమంత్రి నేలపాడులో నిర్మిస్తున్న ఎన్‌జివో హౌసింగ్ సముదాయంలో పాత్రికేయులతో మాట్లాడుతూ రాజధానిలో జరుగుతున్న పనుల పురోగతిని అధికారులతో కలసి పరిశీలించడం జరిగిందన్నారు. రాజధానిలో రోడ్లు తూర్పు నుంచి పడమరకు 16 రోడ్లు, ఉత్తరం నుంచి దక్షిణం కు 18 రోడ్లు కలిపి మొత్తం రాజధానిలో 32 రోడ్లు చేపట్టడం జరిగిందన్నారు. మొత్తం 320 కిలోమీటర్ల రోడ్లతో పాటు రైతుల ఫ్లాట్‌లలో ఎల్‌పిఎస్ రోడ్లు 1250 కిలోమీటర్లు వేస్తున్నామని, వీటిని 14 ప్యాకేజీలుగా విభజించి ఆరు ప్యాకేజీల పనులు చేపట్టామని మిగతా ప్యాకేజీలు టెండరు ప్రక్రియలో ఉన్నాయన్నారు. పేద, మధ్యతరగతి వర్గాల కోసం రాజధానిలో 5 వేల గృహాలు చేపట్టామని, వాటి పనుల పురోగతి కూడా కొనసాగుతుందన్నారు. వీరితో పాటు ఎన్‌జివో ఉద్యోగులకు 1952 ప్లాట్లు నిర్మిస్తున్నామని, అఖిల భారత స్థాయి అధికారులకు మరియు ఎమ్మెల్యేలకు ఇళ్ల నిర్మాణం మొదలైందన్నారు. అందుబాటులో ఉన్న నూతన సాంకేతిక పరిజ్ఞానం షేర్‌వాల్ టెక్నాలజీతో దీనికి సంబంధించి 220 కిలోమీటర్ల రోడ్లకు సంబంధించి టెండర్లు పూర్తి అయ్యాయని పనులు కూడా గ్రౌండింగ్ అయ్యి వేగంగా జరుగుతున్నాయని, మిగతా వాటికి సంబంధించిన పనులు కూడా



త్వరలోనే ప్రారంభమౌతాయన్నారు. రాజధానిలో బ్యూటిఫికేషన్, రిజర్వాయర్‌లు, బోటింగ్ ఏర్పాటుకు మొదటి ప్రాధాన్యత ఇస్తామన్నారు. అమరావతి రాజధాని ప్రపంచంలోనే ఒక బెస్ట్ సిటీగా తయారు కావడానికి చర్యలు చేపడుతున్నామన్నారు. అసెంబ్లీ, హైకోర్టు భవనాలకు టెండర్ల ప్రక్రియను త్వరలోనే పూర్తిచేస్తామని, ఇప్పటికే జిల్లా కోర్టు ప్రక్రియ పూర్తిచేశామన్నారు. రాజధానికి గ్రీనరీ, నీటి సదుపాయం అందుబాటులో ఉందని వాటితో అభివృద్ధిని సాధిస్తామన్నారు. రాజధానిలో పార్కుల అభివృద్ధి బాధ్యత అమరావతి అభివృద్ధి కార్పొరేషన్‌కి ఇచ్చామని, అభివృద్ధి పనులను సిఆర్‌డిఎ చేస్తుందన్నారు. రాజధాని అభివృద్ధిని అడ్డుకోవటానికి కొద్ది మంది కావాలని చిచ్చుపెడుతున్నారని, రాజధాని అభివృద్ధిని అడ్డుకోవడం తెలుగు జాతికి అంత శ్రేయస్కరం కాదన్నారు. మన కంటూ ఆర్థిక నగరం, ఎంప్లాయిమెంట్ జనరేషన్ సిటీ

- మిగతా 2 లో



# భానుడి భగభగలు



- తెలుగు రాష్ట్రాల్లో పెరుగుతున్న ఉష్ణోగ్రతలు
- వేసవి ప్రణాళిక లేని ప్రభుత్వం
- మూగజీవాలకు గడ్డుపరిస్థితి

**రాజధాని ప్రతినిధి, అమరావతి :** రాష్ట్రంలో ఎండలు మండిపోతున్నాయి. సూర్యప్రతాపానికి ప్రజలు విలవిల్లాడిపోతున్నారు. రోజురోజుకు భానుడు తన విశ్వరూపాన్ని ప్రదర్శిస్తుండటంతో ప్రజలు ఇళ్లలో నుంచి బయటకు వచ్చేందుకు కూడా జంకుతున్నారు. ఇప్పటికే ఉష్ణోగ్రత 45 డిగ్రీలకు చేరగా రాష్ట్రంలోని గుంటూరు జిల్లా రెంటచింతలలో అత్యధికంగా 45 డిగ్రీలు, కడపలో 44 డిగ్రీల ఉష్ణోగ్రతలు వారం రోజుల క్రితం 36 డిగ్రీలుండగా అది 45 డిగ్రీలకు చేరింది. ఒక్కసారిగా వేసవితాపం పెరగటంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారు. విపరీతమైన ఎండలతో తెలుగు రాష్ట్రాలు నిప్పులకొలిమిలా మారిపోయాయి. విజయవాడ, కరీంనగర్, గుంటూరు, కడప, నెల్లూరు, విజయనగరం,


- మిగతా 2 లో

## తెలంగాణ ఎంసెట్ ఫలితాలు విడుదల



**హైదరాబాద్ :** తెలంగాణ ఎంసెట్ ఫలితాలు విడుదలయ్యాయి. ఈరోజు మధ్యాహ్నం ఒంటి గంటకు ఉపముఖ్యమంత్రి కడియం శ్రీహరి ఎంసెట్ ర్యాంకులను సచివాలయంలో ప్రకటించారు. ఎంసెట్ ఇంజినీరింగ్‌కు 1,36,311 మంది, అగ్రికల్చర్ పరీక్షకు 66,857 మంది హాజరయ్యారు. ఎంసెట్ ఇంజినీరింగ్‌లో 78.24 శాతం, ఎంసెట్ వ్యవసాయం, ఫార్మాలో 90.72 శాతం ఉత్తీర్ణత నమోదైంది. అయితే ఫలితాలను శనివారం సాయంత్రం 4 గంటలకు వెల్లడి చేస్తామని అధికారులు నిన్న ప్రకటించారు. ఫలితాల విడుదల సమయంలో స్వల్ప మార్పులు చేసినట్లు ఈరోజు వెల్లడించారు.



# శాసనసభలో చతికిలపడ్డ కర్ణాటక భాజపా

**మొదటి పేజీ తరువాయి**

స్వయంగా వీక్షించానని, వారికి తగినంత చేయలేకపోయాననే బాధ తనకు ఉండేదని చెప్పారు. తాను సీఎం పగ్గాలు చేపట్టగానే వారికి ఎంతో చేయాలనే తపన కనబరిచానని అన్నారు. బీజేపీకే ప్రజలు పట్టం కట్టారని, 40 సీట్ల నుంచి 104 సీట్లకు ఎదగడం ద్వారా ప్రజలు తమకే పట్టం కట్టారని చెప్పారు. ప్రధాని మోదీ, అమిత్‌షా ఆశీర్వాదం వల్లే తాను సీఎం అయ్యానని అన్నారు. కర్ణాటకకు నిజాయితీ కలిగిన రాజకీయ నేతలే కావాలని, ప్రజలు తనపై ఉంచిన విశ్వాసాని క ృతజ్ఞతలు చెబుతున్నానని అన్నారు. ప్రజాస్వామ్యంపై బీజేపీకి ఎంతో నమ్మకం ఉందని, కర్ణాటక ప్రజల పట్ల మోడీకి ఎంతో గౌరవం, వారికి ఎంతైనా చేయాలనే తపన ఉందని యడ్యూరప్ప చెప్పారు. 2019 సార్వత్రిక ఎన్నికల్లో బీజేపీని 28 సీట్లలో గెలిపిస్తానని ఆయన చెప్పారు. ప్రసంగం మధ్యలో భావోద్వేగానికి గురయ్యారు. చివరగా...సంఖ్యాబలం నిరూపించుకోవడంలో తాను విఫలమయ్యానంటూ రాజీనామాను ప్రకటించారు.

**బీజేపీకి వ్రతం చెడినా ఫలితం దక్కలేదు**

కర్ణాటకలో భారతీయ జనతా పార్టీకి వ్రతం చెడినా ఫలితం దక్కలేదు. కాంగ్రెస్, జేడీఎస్ అత్యంత వ్యూహాత్మకంగా వ్యవహరించడంతో సీఎం యడ్యూరప్ప బలపరీక్ష కంటే ముందే రాజీనామా చేయాల్సి వచ్చింది. ఎమ్మెల్యేలను పకడ్బందీగా కాపాడుకున్న కాంగ్రెస్, జేడీఎస్ ఒక ప్రణాళిక ప్రకారం బీజేపీ అగ్రనేతల ప్రలోభాలను సాక్ష్యాలతో సహా బయట పెట్టింది. కాంగ్రెస్ ఎమ్మెల్యేలను కొనుగోలు చేసేందుకు బీజేపీ తరఫున బిగ్ షాట్‌లే రంగంలోకి దిగారు. నీతులు చెప్పిన పెద్దలందరూ అదే పని చేశారు. మైనింగ్ జాన్ గాలి జనార్ధన్ రెడ్డి ఈ ముఠాకు నాయకత్వం వహించారు. యడ్యూరప్ప, శ్రీరాములు, మురళీధరరావు, చివరికి ప్రకాష్ జవదేకర్ కూడా కాంగ్రెస్ ఎమ్మెల్యేలను ప్రలోభపెడుతూ దొరికిపోయారు. కానీ ఎమ్మెల్యేలు ఎవరూ ఫిరాయించడానికి



అంగీకరించలేదు.

మంత్రి పదవులు, వందల కోట్లు ఇచ్చిఅయినా ప్రభుత్వాన్ని కాపాడుకుందామని అనుకున్న బీజేపీ చివరి క్షణంలో వెనక్కి తగ్గింది. తమ ప్రయత్నాలన్నీ విఫలం కావడంతోపాటు బీజేపీ పరువు పోయేలా బేరసారాల ఆడియోలు బయటకు రావడంతో గెలిచినా ఆ చెడ్డపేరు పార్టీని దేశం మొత్తం వెంటాడుతుందని తేలిపోయింది. దాంతో ఎట్టి పరిస్థితిలోనూ దక్షిణాదిన కర్ణాటకలో అడుగుపెట్టాలనుకున్న ప్రధాని మోదీ, అమిత్ షా చివరి క్షణంలో ముందుకు వెళ్లకూడదని నిర్ణయించుకున్నారు. శనివారం ఉదయం నుంచి అసెంబ్లీలో జరిగిన పరిణామాలు కూడా బీజేపీకి ప్రతికూలంగా ఉన్నాయి. బల పరీక్ష జరిగినా పరువు పోయే పరిస్థితి ఉండడంతో వాజ్‌పేయి ఫార్ములాను ఫాలో అయి ఎంతో కొంత పరువు నిలబెట్టుకోవాలని అనుకుంది. ఇందుకు అనుగుణంగానే అసెంబ్లీకి కేంద్ర మంత్రి అనంతకుమార్ వచ్చి ప్రధాని సందేశాన్ని యడ్యూరప్పకు చేరవేశారు. ఆ తర్వాత కూడా యడ్యూరప్ప అమిత్ షాకు ఫోన్ చేసి మాట్లాడారు. రాజీనామా చేయాలని అమిత్ షా కూడా సూచించడంతో యడ్యూరప్ప లేఖ సిద్ధం చేసుకున్నారు.

**నేడే సీఎంగా కుమారస్వామి ప్రమాణం...?!**

యడ్యూరప్ప రాజీనామా ప్రకటించగానే అసెంబ్లీలో కుమారస్వామి సంబరాలు బెంగళూరు: బల నిరూపణ పరీక్షకు ముందే బీజేపీ ఓటమిని అంగీకరించడంతో కర్ణాటక రాజకీయం ఊహించని మలుపుతిరిగింది. బలపరీక్ష తీర్మానంపై మాట్లాడిన సీఎం యడ్యూరప్ప తన పదవికి రాజీనామా చేస్తున్నట్లు ప్రకటించారు. దీంతో కొత్త ముఖ్యమంత్రి ఎంపిక అనివార్యమైంది. ఇప్పటికే జేడీఎస్ చీఫ్ కుమారస్వామిని ముఖ్యమంత్రి అభ్యర్థిగా సమర్థిస్తూ కాంగ్రెస్, జేడీఎస్ ఎమ్మెల్యేలు సంతకాలు సమర్పించిన దరిమిలా గవర్నర్ వజుభాయ్ వాలా కీలక నిర్ణయం తీసుకోనున్నారు. విశ్వసనీయ సమాచారం ప్రకారం.. శనివారమే కుమారస్వామికి గవర్నర్ నుంచి పిలుపు రానున్నట్లు తెలిసింది. ఈ రోజే ఆయన ముఖ్యమంత్రిగా ప్రమాణం చేస్తారని కన్నడ రాజకీయ వర్గాలు వెల్లడించాయి.

**బలనిరూపణ: అసెంబ్లీలో అనూహ్య దృశ్యం!**

బలపరీక్ష నేపథ్యంలో కర్ణాటక అసెంబ్లీ సమావేశాలు తిరిగి ప్రారంభమయ్యాయి. ఉదయం ప్రమాణం చేయని ఎమ్మెల్యేలతో ప్రోటెం స్పీకర్ ప్రమాణ స్వీకారం చేయించారు. మైసూర్ జిల్లాకు చెందిన ఎమ్మెల్యేలు ప్రమాణం చేశారు. అనంతరం యడ్యూరప్ప విశ్వాస పరీక్ష తీర్మానాన్ని సభలో ప్రవేశపెట్టి.. సభను ఉద్దేశించి ప్రసంగించారు.తిరిగి ప్రారంభమైన తర్వాత అసెంబ్లీలో అనూహ్య దృశ్యం కనిపించింది. బీజేపీ, కాంగ్రెస్ అగ్రనేతలు అసెంబ్లీ గ్యాలరీలో పక్కపక్కనే కూర్చొని కనిపించారు. కాంగ్రెస్ నుంచి గులాం నబీ ఆజాద్, మల్లికార్జున ఖర్గే, అశోక్ గెహ్లాట్, బీజేపీ నుంచి సదానందగౌడ, అనంతకుమార్, శోభ కర్లందాజే పక్కపక్కనే కూర్చొని.. సరదాగా మాట్లాడుతూ.. నవ్వులు చిందించడం కనిపించింది. ఇక కాంగ్రెస్ 'మిస్సింగ్' ఎమ్మెల్యే ఆనంద్‌సింగ్ ఆ పార్టీ సీనియర్ నేత డీకే శివకుమార్ పక్కన కూర్చోవడం గమనార్హం .

## కాంగ్రెస్-జేడీఎస్ సంబరాలు

**బెంగళూరు:** కర్ణాటక ముఖ్యమంత్రి పదవికి బీజేపీ నేత బీఎస్ యడ్యూరప్ప రాజీనామా చేయడంతో కాంగ్రెస్-జేడీఎస్ కూటమికి చెందిన ఎమ్మెల్యేలు అసెంబ్లీలోనే సంబరాలు చేసుకున్నారు. సరిగ్గా 4 గంటలకు బలపరీక్ష జరగాల్సి ఉండగా... దీనికి కొద్ది క్షణాల ముందే యడ్యూరప్ప రాజీనామా చేస్తున్నట్టు ప్రకటించారు. తనకు అవసరమైన సంఖ్యా బలాన్ని సాధించలేకపోయానని అంగీకరించారు. దీంతో అప్పటివరకు తీవ్ర ఉత్కంఠ నెలకొన్న అసెంబ్లీలో ఒక్కసారిగా వాతావరణం మారిపోయింది. కాంగ్రెస్ నేత డీకే శివకుమార్, జేడీఎస్ సీఎం అభ్యర్థి కుమార స్వామి పరస్పరం అభినందించుకుంటూ కనిపించారు. ఇద్దరూ చేతులు పైకెత్తి అసెంబ్లీ గ్యాలరీ వైపు చూస్తూ అభివాదం చేశారు. ఇరుపార్టీలకు చెందిన ఎమ్మెల్యేలంతా ఒకరికొకరు శుభాకాంక్షలు తెలుపుకున్నారు.

# రాజధాని వార్తలు

కలం

## గర్వం పతనానికి నాంది

ఎన్ని మంచి మాటలు చెప్పినా ఒక్క మంచి మాట మనసు కెక్కదుకాని, విషాన్ని చిమ్మే మాటలు చేతలు మాత్రం యుగయుగాలుగా కొనసాగిస్తూనే ఉంటారు. అహంకారం, అహంభావం అణువణువునా నింపుకొని సాటిమానవుల పట్ల అనాగరికతను ప్రదర్శిస్తూనే ఉంటారు. చరాచర సృష్టిలో అతిసూక్ష్మజీవుల నుంచి అతిపెద్ద జంతువు ఏనుగుల వరకు ప్రతి ఒక్కరికీ ఈ భూమి మీద చోటుంది. అంతేకాదు ఎవరి బాధ్యతలు వారికి, ఎవరి గుర్తింపు వారికి ఉన్నాయి. ఏదో నేనే గొప్పని, నేను లేకుంటే ఏమీ జరగదని, అతీంద్రుడనని భావించడం ఇతరులను చిన్న చూపు చూడటం కేవలం అల్ప స్వభావం మాత్రమే. రంగును , కులాన్ని, ప్రాంతాన్ని బట్టి ఉన్నతులు ఎవరూ కాలేరు. మాట, స్వభావం, వ్యక్తిత్వాలను బట్టిమాత్రమే గుర్తింపు గౌరవాలు దక్కుతాయి. డబ్బు, కులం, అధికారాలతో వచ్చే అహం అతి త్వరలోనే మసిబారుతుంది.

ఎవరి ప్రమేయం లేకుండా కేవలం పుట్టుకతో గొప్పవస్తుందంటే అది హాస్యాస్పదం. మనం చేయాల్సింది చేయకుండా గొప్పతనాలను ఆపాదించుకున్నప్పుడే ఇలాంటి కులాలు మతాలు గొప్పవని విర్రవీగుతుంటారు. భూమిపై ఏకులంలో పుట్టినా, ఏమతంలో పుట్టినా, ఏ ప్రాంతంలో పుట్టినా గిట్టక తప్పదు. అయినా బ్రతికున్న నాలుగురోజు నేను..నేను అని అదిరిపడుతుంటారు. ఎంత డబ్బులేకపోయినా ఎస్సీ ఎస్టీల్లో పుట్టాలనుకోముకదా అని ఒకరంటే, మరొకరేమో ఎస్సీ, ఎస్టీలు శుభ్రంగా ఉండరు. చదువురాదు అని తేలిగ్గా మాట్లాడతారు. ఇంకొకరేమో కులమతాల్లో ఎక్కువతక్కువలు ఉన్నాయి.. ఉంటాయి.. అవిపోవు అంటుంటారు..కొత్తగా పదవొచ్చి మరొకరు తనను పట్టించుకోవడం లేదనే దుగ్ధతో ఎయ్ .. ఏం చేస్తున్నావ్.. ఎంటీ ఫోన్లో తలదూర్చి ఎవరినీ పట్టించుకోవడం లేదు.. అంటూ హియరింగ్‌ఫోన్లు తీసుకొని విని (అవి భక్తిగీతాలు) మరీ ..నువ్వు ఎందుకూ పనికిరావు.. నీకు చదువురాదు. అని తిట్టడంమే కాకుండా వీడెందుకూ పనికిరాడని శాపనార్థాలు పెట్టడం ఎంతవరకు సబబు ? కొత్తగా పదవులు చేపడితే అందరూ ఆయన వెనుక తిరగాలా ? ఆయన ఆర్టీసీ పనితీరును మెరుగుపరచాలని వచ్చారు. ఆ పనిచేయకుండా ఈ అంకమ్మశివాలేంటి ? అంతకుముందు రోజే ఆర్టీసీ బస్సు కండక్టర్లు, డ్రైవర్లు ప్రయాణీకులతో మర్యాదగా నడుచుకోవాలని చెప్పిన సదరు పెద్దమనిషి కాలేజీ యువకుడిపై విరగబాటేంటి ? దీన్నే అంటారు.. కోడలికి బుద్ధిచెప్పిన అత్త తెడ్డునాకిందని. ఏది ఏమైనా ఎవరి వ్యవహారాల్లోనూ తలదూర్చకుండా పరీక్ష రాసి రిలాక్స్ అవుతున్న విద్యార్థిని అంతంతేసి మాటలనడం ఎంతమాత్రం తగదు. అధికార నేతలంతా ఇలా విరగబడటానికి కారణం కోర్టులు, మానవహక్కుల సంఘాలు పట్టించుకోక పోవడమే.. అవి రెండూ కులమతాల విషయంలో కఠినంగా వ్యవహరిస్తే ఇలాంటి వారు నోటిని నియంత్రితంచు కుంటారు. నిజానికి ఆ విద్యార్థి నుంచి ఇయర్ ఫోన్లు లాక్కుని వింటున్నప్పుడు చాలా నవ్వుతూ ఆప్యాయంగా సమాధానం చెప్పాడు. అయినా సదరు నాయకుడు నోరు పారేసుకున్నాడు.(పిసరంత బుద్ధి ఉన్నవాడెవరూ అలా చేయరు) మరొకరిని చిన్నబుచ్చడం ద్వారా తామేదో గొప్పోళ్లమయి పోతామనుకుంటే దానికంటే అజ్ఞానం మరొకటి ఉండదు. ఈ అధికార పక్షాలు నోరు పారేసుకున్నప్పుడల్లా ఆపార్టీ కార్యకర్తలు బాధిత వ్యక్తుల వద్దకు వెళ్లి బతిమాలి, బామాలి లేదంటే బెదిరించి వారి నోళ్లను నొక్కుతుంటారు. అలా కాకుండా ఇలాంటి అవకతవక మాటలకు పాల్పడినప్పుడు అందరు కలసి ముక్త కంఠంతో ఖండించి, వారిపై చర్యలు తీసుకునేంత వరకు పోరాటాలు సాగిస్తే .. మళ్లీ మళ్లీ ఇలాంటి ఘటనలు పునరావృతం కావు.

అయితే పాలకపార్టీలు ఎప్పుడూ ముందుచూపుతోనే ప్రవర్తిస్తాయి. రాబోయే రోజులను ముందుగానే గుర్తిస్తాయి. అందుకే కులాలుగా, మతాలుగా విబేధాలు సృష్టించింది చాలక ఎస్సీల్లో కూడా వర్గీకరణ అంటూ మాల, మాదిగలను కూడా విభజించారు. దీంతో ఆయా వర్గాలు ఎవరిని అంటే వారే రెండురోజులు ఆందోళనలు జరిపి నోరుమూసుకుంటున్నారు. ఇది సరికాదు. ఎస్సీల్లో వర్గబేధాలు ఉన్నప్పటికీ ఇలాంటి ఘటనలు జరిగినప్పుడు తప్పనిసరిగా సమైఖ్యంగా గొంతువిప్పాల్సిన అవసరం ఉంది. వర్గబేధాలు ఇంటి సమస్యలాంటిది.. అవి మనం-మనం పరిష్కరించుకోదగినవి. అయితే ఇలాంటి విషయాల్లో మాత్రం సంఘటితంగా పోరాడినప్పుడే పొగరబోతు నోర్లు మూత పడతాయని గుర్తుంచుకోవాలి. పదవుందని, అధికారం ఉందని అహంకారం ప్రదర్శిస్తే.. పతనం తప్పదు...తస్మాత్ జాగ్రత్త.




# భానుడి భగభగలు

**మొదటి పేజీ తరువాయి**

శ్రీకాకుళం, వరంగల్, ఆదిలాబాద్‌లో అత్యధిక ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి. ఎండ ధాటికి రోడ్లన్నీ నిర్మానుష్యంగా మారిపోయాయి.

మరోవైపు కనిష్ట ఉష్ణోగ్రతలు కూడా విపరీతంగా పెరిగిపోతున్నాయి. ఇవి 28 డిగ్రీల నుంచి 30 డిగ్రీల మధ్యలో నమోదవుతున్నాయి. పెరుగుతున్న ఉష్ణోగ్రతలపై ప్రభుత్వం అంతగా స్పందించకపోవటం గమనార్హం. వడదెబ్బకు గురైన వారికి చికిత్స చేసేందుకు అవసరమైన వైద్య పరికరాలు నేటికీ ఆసుపత్రులకు చేరలేదు. ఓఆర్ఎస్ ప్యాకెట్లను కూడా పంపించకపోవటంపై విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. సాధారణంగా మార్చి రెండో వారం నుంచి జూన్ మొదటి వారం వరకు ఎండ తీవ్రత అధికంగా ఉంటుంది. ఈ ఏడాది వాతావరణంలో సంభవించిన మార్పుల వల్ల మార్చి, ఏప్రిల్‌లో అధిక ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి.

మే ప్రారంభంతోనే భానుడి భగ భగలు పెరిగాయి. వారం రోజులుగా ఉష్ణోగ్రతలు క్రమంగా పెరుగుతున్నాయి. ఉదయం పది గంటల నుంచే ఉష్ణోగ్రతలు 35 డిగ్రీలకు చేరుతున్నాయి. ఆ తర్వాత సాయంత్రం నాలుగు గంటల వరకు 40 డిగ్రీల నుంచి 45 డిగ్రీల మధ్యలో ఉష్ణోగ్రతలు ఉంటున్నాయి. తేమశాతం తగ్గటంతోపాటు గంటకు 23.8 కిలో మీటర్ల వేగంతో వేడి గాలులు వీస్తున్నాయి. దక్షిణ కోస్తా, రాయలసీమలో అధిక ఉష్ణోగ్రతలు నమోదవుతున్నాయి. ప్రభుత్వం వేడి గాలులు, వడదెబ్బపై ప్రజలకు కనీసం అవగాహన కార్యక్రమాలు కూడా నిర్వహించటంలేదు. రాష్ట్రంలో కృష్ణాజిల్లా అధికారులు మినహా ఎక్కడా వేసవికి ముందస్తు చర్యలు చేపట్టలేదు. కృష్ణాలో రూ. 1.3 కోట్లతో చలివేంద్రాలను ఏర్పాటు చేయటంతోపాటు 1,400 మంది పారా మెడికల్ సిబ్బందిని అత్యవసరసేవల కోసం వినియోగిస్తున్నారు. ఇదిలావుండగా, పెరుగుతున్న ఎండలను దృష్టిలో పెట్టుకుని ప్రజలు తగు జాగ్రత్తలు తీసుకోవాల్సిన అవసరం ఎంతైనా ఉంది. చల్లటి నీరు, బార్లీ నీళ్ల, కొబ్బరి నీళ్లు, మజ్జిగ తీసుకోవటంతోపాటు కూల్ డ్రింక్స్‌కు దూరంగా ఉండాలని వైద్యులు చూచిస్తున్నారు.



**వేసవి ప్రణాళిక ఏది...!**

రాష్ట్రంలో ఎండలు పెరుగుతున్నా, ప్రభుత్వం మాత్రం వేసవి ప్రణాళికలను రూపొందించకపోవటం గమనార్హం. వేసవిలో తాగునీటికి రూ. 103.82 కోట్లను కేటాయించినా, తాగునీటి సమస్య మాత్రం తీరటంలేదు. రాష్ట్రంలో 22,602 చేతి పంపులు, 1,608 తాగునీటి పథకాలకు మరమ్మతులు చేశామని అధికారులు లెక్కలు చూపిస్తున్నారు. ఫిబ్రవరిలోనే ప్రణాళికను ప్రకటించినా, క్షేత్రస్థాయిలో అమలుకావటంలేదు. రిజర్వాయర్లలో నీటి కొరత కారణంగా నీటి ఎద్దడి పెరిగింది. ట్యాంకర్ల ద్వారా కూడా నీటిని సరఫరా చేయకపోవటంతో కొన్ని చోట్ల ఒక్క పూట కూడా తాగునీరు సరఫరాకాని పరిస్థితి నెలకొంది. ఎండలో పని చేసే ఉపాధి హామీ పథకం కార్మికులకు కూడా ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేయలేదు. కార్మికులకు టెంట్‌లు వేయటం, మజ్జిగ పంపిణీ నామమాత్రంగానే అమలవుతున్నాయి. వర్షాభావం వల్ల ఎక్కడా నీళ్లు లేకపోవటంతో పశువులు పశుగ్రాసం, నీటి కోసం అల్లాడుతున్నాయి. మూగజీవాల కోసం నీటిని ఎక్కడ నుంచి తేవాలో రైతులకు అర్థంకావటంలేదు. పశువులకు నీటి వసతి కల్పనలోనూ ప్రభుత్వం వైఫల్యం చెందిందనే విమర్శలు వ్యక్తమవుతున్నాయి. పలు జిల్లాల్లో నీటి తొట్లెలు ధ్వంసమయ్యాయి. పశుగ్రాసం కొరత కూడా తీవ్రంగానే ఉంది. ట్రాక్టర్ వరిగడ్డిని రూ. 6 వేల నుంచి రూ.ఏడు వేలు పెట్టి కొనుగోలు చేయాల్సి వస్తోందని రైతులు వాపోతున్నారు.

## డాలస్‌లో 27 నుంచి తెదేపా మహానాడు

**రాజధాని ప్రతినిధి, అమరావతి :** అమెరికాలోని డాలస్ వేదికగా ఈ నెల 27 నుంచి రెండురోజుల పాటు నిర్వహించే మహానాడుకు తెదేపా నేతలను పంపాలని తానా మాజీ అధ్యక్షుడు కోమటి జయరాం, నాట్స్ అధ్యక్షుడు మోహన్‌కృష్ణ, చెన్నూరి సుబ్బారావు తదితరులు ముఖ్యమంత్రి చంద్రబాబును కోరారు. ఉండవల్లిలోని నివాసంలో సీఎంను వారు కలుసుకున్నారు. మొదటిసారిగా అమెరికాలో పెద్దఎత్తున నిర్వహించే మహానాడుకు పార్టీ అభిమానులు, కార్యకర్తలు అధిక సంఖ్యలో హాజరవుతున్నారని వివరించారు. అమెరికా అభివృద్ధిలో తెలుగు ఎన్‌ఆర్‌ఐల భాగస్వామ్యం ఎనలేనిదని సీఎం వారి అభినందించారు. ఆంధ్రప్రదేశ్‌లో జరుగుతున్న అభివృద్ధిని మహానాడులో వివరించాలన్నారు. కార్యక్రమానికి తెదేపా నేతలు హాజరవుతారని హామీ ఇచ్చారు.

## రాజధానిలో సీఎం సుడిగాలి పర్యటన

**మొదటి పేజీ తరువాయి**

అవశ్యకత ఉండాలన్నారు. అయినా అన్ని ప్రాంతాలు అభివృద్ధి చెందేలాగా ఎక్కడికక్కడా చర్యలు చేపడుతున్నామన్నారు. ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడుతో పాటు రాజధాని అభివృద్ధి పనుల పరిశీలనలో మంత్రులు పి. నారాయణ, నక్కా ఆనందబాబు, ప్రత్తిపాటి పుల్లారావు, ఇంధన శాఖ ముఖ్య కార్యదర్శి ఆజయ్‌జైన్, సీఆర్‌డీఏ కమీషనర్ చెరుకూరి శ్రీధర్, సిఆర్‌డిఎ, ఎడీసి అధికారులు తదితరులు పాల్గొన్నారు. ముఖ్యమంత్రి పరిశీలించిన ప్రాంతాలు. ముందుగా ముఖ్యమంత్రి ఉండవల్లి నివాసం నుంచి ఉదయం 9.30 నిమిషాలకు బయలుదేరి వెంకటాయపాలెం నర్సరీ పరిశీలించి ఎడీసీ అధికారులకు పలు సూచనలు చేశారు. అక్కడ నుంచి బయలుదేరి కె.ఎం.బి ప్రాజెక్ట్ చేపడుతున్న పేద, మధ్య తరగతి ఇళ్లను పరిశీలించారు. తదనంతరం శాఖమూరి జంక్షన్ వద్ద ఏర్పాటు చేసిన ఫోటో ఎగ్జిబిషన్ పరిశీలన తరువాత రాయపూడిలో నిర్మిస్తున్న అఖిల భారత స్థాయి అధికారుల ఇళ్ల సముదాయాన్ని పరిశీలించారు. అనంతరం నేలపాడులో గల ఎన్‌జివో హౌసింగ్ ఇళ్ల సదుపాయాన్ని పరిశీలించిన తరువాత పాత్రికేయులతో మాట్లాడిన అనంతరం ఒకటిన్నర ప్రాంతానికి సచివాలయానికి ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు చేరుకున్నారు.

# లంకభూములు దళితులకే ఇవ్వాలి

## రాజధాని సమన్వయ కమిటీ కన్వీనర్ బాబూరావు



**రాజధాని ప్రతినిధి,తుళ్లూరు :** తుళ్లూరు మండల పరిధిలో రూ. 1,000 కోట్లు విలువ చేసే 572 ఎకరాల లంక భూములను కబ్జాకోరుల నుంచి కాపాడాలని, వాటిని దళితులకే అప్పగించాలని సిపిఎం రాజధాని ప్రాంత సమన్వయ కమిటి కన్వీనర్ సిహెచ్.బాబూరావు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. రాజధాని నేపథ్యంలో ఎకరా రూ. 2 కోట్లు పలుకుతోందని, దీంతో కొందరు కబ్జా చేసి అమ్మడానికి ప్రయత్నిస్తున్నారని చెప్పారు. ఈ వ్యవహారంపై సిఎం స్పందించాల్సిన అవసరం ఉందన్నారు. సిపిఎం రాజధాని డివిజన్ కమిటి కార్యదర్శి ఎం.రవితో కలిసి ఆయన రాయపూడి వచ్చి స్థానిక కూలీలు, దళితులతో సమావేశమయ్యారు. ఈ సందర్భంగా దళితులు లంకభూముల విషయంలో తమకు న్యాయబద్ధమైన హక్కుందని చేప్పడంలో తాము మద్దతుగా న్యాయబద్ధమైన ఉంటామని సిపిఎం నాయకులు స్పష్టం చేశారు. అనంతరం కష్ణా నదికి అవతలి వైపు ఉన్న లంకభూములను పరిశీలించడానికి సిద్ధమవుతున్న నాయకుల ను ఎస్‌ఐ శ్రీనివాస్ లంకభూములకు సంబంధించి ఇరుపక్షాలపై కేసులు నమోదు చేశామని, ఆ భూముల్లోకి వెళ్లేందుకు అనుమతి లేదన్నారు. దీంతో బాబురావు స్పందిస్తూ తరతరాలుగా లంకభూములను సాగుచేసుకుంటున్న దళితుల న్యాయమైన డిమాండ్‌కు మద్దతుగా తాము భూముల వద్దకు వెళ్లి తీరుతామని స్పష్టం చేశారు. ఏ నిబంధనల ప్రకారం వెళ్లకూడదో చెప్పాలంటూ నిలదీయడంతో పోలీసులకు అనుమతించక తప్పలేదు. సిహెచ్.బాబురావు విలేకరులతో మాట్లాడుతూ రాయపూడికి చెందిన 360 దళిత కుటుంబాలు 572 ఎకరాల లంకభూముల్లో రెల్లిగడ్డి సాగుచేస్తున్నారని చెప్పారు. బ్రిటీష్‌కాలం నాటి నుంచి లంకలు దళితుల ఆధీనంలోనే ఉన్నాయన్నారు. 'ది హరిజన జాయింట్ ఫార్మింగ్ సొసైటి' పేరుతో సాగుచేసుకుంటున్న లంకభూములను విజయవాడకు చెందిన బలరాం దళితులకు ఏటా కౌలు చెల్లిస్తానని నమ్మబలికి జామాయిల్ మొక్కలు పెంచుతూ లబ్ధి పొందుతున్నాడని చెప్పారు. 3 రోజుల్లోగా దళితుల డిమాండ్లకు అనుగుణంగా చర్యలు తీసుకోకపోతే రాజధాని ప్రాంతంలోని పేదలు, దళితులతో కలిసి ప్రత్యక్ష కార్యాచరణకు దిగుతామని ప్రభుత్వాన్ని హెచ్చరించారు. కార్యక్రమంలో సిపిఎం డివిజన్ నాయకులు కె. సుందరయ్య, పేరం బాబురావు, కుంభా ఆంజనేయులు, రాయపూడి భూముల సాగుదారులు ఉన్నారు.

# అంతా మా ఇష్టం

బీజేపీ అనైతిక రాజీయాలు చేయడంలో బరితెగింపు ప్రదర్శిస్తోంది. ఎగ్జిట్‌పోల్స్‌లో చెప్పినట్లుగానే కర్ణాటకాలో హంగ్ తప్పలేదు. కాంగ్రెస్‌ను ప్రజలు చీత్కరించారు అనడానికి దానికి 2014 కంటే ఓట్ల శాతం పెరిగింది. బీజేపీని గెలిపించారా అంటే 2013 కంటే దాని ఓట్లశాతం తగ్గింది. అయితే గెలుచుకున్న స్థానాలు పెరిగాయి. ఓటర్లు పూర్తిగా దానికి పట్టం కట్టలేదు. అందుకే ప్రభుత్వాన్ని ఏర్పాటు చేసేందుకు కావాల్సిన 112 సీట్లను అది రాబట్టుకోలేక పోయింది. అయినా రాజ్యాంగాన్ని ఉల్లంఘించి గవర్నర్ వాజూభాయ్ బీజేపీకి పట్టం కట్టడం ప్రజాస్వామ్యవాదులను, దేశపౌరులను ఆవేదనకు గురిచేస్తోంది.

**మోడీస్వామ్యం**

సుప్రీం కోర్టు తీర్పుమేరకు ఎన్నికల్లో ఎక్కువ స్థానాలు గెలుచుకున్న పార్టీకి గాని, లేదంటే ఎన్నిక ముందు కూటమిగా ఏర్పడిన పార్టీలు గాని, లేదంటే ఎన్నికల తర్వాత కూటమిగా ఏర్పడగా ప్రభుత్వాన్ని ఏర్పాటు చేయడానికి అవసరమైనంత మంది (ఎవరికైతే శాసన సభలో పూర్తి మెజారిటీ ఉందో) ఎమ్మెల్యేలు ఉన్న పార్టీని గవర్నర్ ప్రభుత్వం ఏర్పాటు చేయడానికి ఆహ్వానించాలి. అది రాజ్యాంగ ప్రక్రియ. కాంగ్రెస్‌కు ఇదివరకటి కంటే ఓటింగ్ పెరిగి 38 శాతం చేరుకోగా, జేడీఎస్‌కు 18.4 శాతం కలిసి మొత్తం 56.4 శాతం ఓట్లు ప్లస్ కాంగ్రెస్ 78 సీట్లు , జేడీఎస్ 38 సీట్లు కలుపుకొని 116 సీట్లు అయ్యాయి. ఓట్ల శాతం, సాధించిన సీటు ఏవి చూసుకున్నా కాంగ్రెస్ - జేడీఎస్‌లకే అధికారం కట్టబెట్టవలసిన గవర్నర్ అందుకు విరుద్ధంగా ప్రవర్తించారు. హడావుడిగా యడ్యూరప్పను ముఖ్యమంత్రిగా ప్రమాణస్వీకారం చేయించడమంటే అది అడ్డదారులు తొక్కడానికి, అవినీతి జరపడానికి ఆయన అస్కారం ఇచ్చినట్లే అయింది. ఎందుకంటే 104 స్థానాలతో ఎలా మెజారిటీ వస్తుంది..? ఎలా ప్రభుత్వాన్ని ఏర్పాటు చేస్తావు? ముందున్న పరిస్థితి ఏంటి? అని అడగకుంటా పట్టం కట్టివేయడమంటే ఆయన తన బాధ్యతలను విస్మరించినట్లే...కాదు అవినీతిని ప్రోత్సహించినట్లే.. ఒక్కమాటలో చెప్పాలంటే చాలినంతమంది ఎమ్మెల్యేలను కొనుక్కొండి అని చెప్పడమే కాదా ?

**అప్పటి కాంగ్రెస్ డిమాండు - ఇప్పటి బీజేపీ డిమాండు**

గోవాలో గతేడాది మార్చిలో జరిగిన ఎన్నికల్లో 40 అసెంబ్లీ సీట్లకు కాంగ్రెస్ 17,బీజేపీకి 12 సీట్లు వచ్చినప్పటికీ ఎన్నికల అనంతరం ఏర్పడ్డ కూటమితో అత్యధిక సీట్లు సాధించిన కాంగ్రెస్‌ను పక్కన బెట్టి గవర్నర్ ఎంజీపీ, జీఎఫ్‌బీలతో జతకట్టి బీజేపీతో ప్రభుత్వాన్ని ఏర్పాటు చేయించారు.

మణిపూర్‌లో అసెంబ్లీ లో కూడా ఇదే జరిగింది 60స్థానాలున్న అసెంబ్లీలో కాంగ్రెస్ 28 సీట్లు, బీజేపీ 21సీట్లు గెలుచుకోగా, ఎన్నికల ఫలితాలు వెలువడిన తర్వాత కుదిరిన కూటమితో అక్కడ ప్రభుత్వాన్ని ఏర్పాటు చేసేందుకు గవర్నర్ అనుమతించారు. ఇందులో ట్విస్టు ఏంటంటే ఆ రాష్ట్రంలో ఎన్నికైన ఒకేఒక్క స్వతంత్ర అభ్యర్థిని ఇంఫాల్ ఎయిర్‌పోర్టులో భద్రతాదళాలు అరెస్టుచేసి బీజేపీకి అప్పగించాయి.

మేఘాలయాలో అసెంబ్లీ సీట్ల సంఖ్య 60 కాగ, కాంగ్రెస్‌కు 21, బీజేపీకి కేవలం 2 సీట్లు వచ్చాయి. అయినా అక్కడ ప్రభుత్వాన్ని ఏర్పాటు చేయడంలో బీజేపీ వెనుకుబడలేదు. ఎన్‌పీఈపీ, యూడీపీ, పీడీఎఫ్,హెచ్ఎస్‌డీపీడీపీలతో కలసి ప్రభుత్వంలో భాగస్వామ్యం పొందింది. వీటిపై కాంగ్రెస్ కోర్టుకెళ్లగా అప్పటి ఆర్థిక మంత్రి అరుణ్‌జైట్లీ (జైట్లీ ఆనారోగ్యకారణాలతో పీయూష్ గోయల్ ప్రస్తుతం ఆర్థిక శాఖను నిర్వహిస్తున్నారు) అత్యధిక సీట్లు సాధించిన కూటమికే అధికారం కట్టబెట్టవచ్చని ట్వీట్‌చేశారు. ఎన్నికల ఫలితాల్లో అతిపెద్ద పార్టీగా అవతరించిన పార్టీనే గవర్నర్ ప్రభుత్వం ఏర్పాటుకు ఆహ్వానించాలని ప్రస్తుత బీజేపీ కోరడమే కాకుండా యడ్యూరప్పతో ముఖ్యమంత్రిగా కూడా ప్రమాణ స్వీకారం చేయించింది.

## ముందు గొయ్యి వెనుక నుయ్యి

అధికారం ఉందని ఎలాపడితే అలా నిర్ణయాలు తీసుకుందని విర్రవీగితే ఏదో ఒక రోజు అవే మెడకు చుట్టుకుంటాయి ప్రస్తుతం బీజేపీ పరిస్థితి ఇలాగే ఉంది.

పాట్నా : కర్ణాటక రాజకీయాలు మిగతా బీజేపీ రాష్ట్రాలకు చుట్టు కున్నాయి. దీంతో బీజేపీ పరిస్థితి ముందుగొయ్యి వెనుక నుయ్యిలా మారింది. మొదటి నుంచి తగినంత శాసనసభ్యులు లేకున్నా దూకుడుగా ప్రభుత్వాలను ఏర్పాటు చేసిన కాషాయపార్టీ కర్ణాటక రాజకీయాలతో ముందుకెళితే మిగిలిన మూడు రాష్ట్రాల్లో అధికారం చేజార్చుకునే ప్రమాదం ఉంది. ఒకవేళ కర్ణాటకలో యడ్యూరప్ప ప్రభుత్వ ఏర్పాటు చేయకుండా వెనక్కుతగ్గితే పరువుపోతుంది. బీహార్‌లో 80 సీట్లతో అతిపెద్ద పార్టీగా అవతరించిన రాష్ట్రీయ జనతాదళ్ (ఆర్జేడీ) కి అధికార పగ్గాలు అప్పగించాలని, కాంగ్రెస్ సీపీఎంఎల్ సభ్యులతో ప్రస్తుతం 111 సీట్లున్నాయని, నితీష్ పాలనతో విసిగిపోయిన వారి మద్దతుకూడా తమకే ఉందని ఆపార్టీ నేత తేజస్వియాదవ్ రాష్ట్ర గవర్నర్ సత్యపాల్ మాలిక్‌క వెల్లడించారు. 2015లో బీహార్ ఎన్నికల ముందు బీజేపీయేతర పార్టీలన్నీ మహగఠ్బండన్ పేరుతో మహాకూటమి ఏర్పాటు చేసి ఎన్నికల్లో విజయం సాధించింది అయితే ఆ తర్వాతి పరిణామల్లో నితీష్ (71సీట్లు) తన పార్టీని బీజేపీతో కలిసి అధికారం చేపట్టారు. కర్ణాటకలో అతిపెద్ద పార్టీకే ప్రభుత్వం ఏర్పాటు చేసే అధికారం ఉందని తెలపడంతో ఈ వ్యవహారం బయటకు వచ్చింది. సంఖ్యాబలం లేకన్నా చిన్నాచితక పార్టీలతో ఎన్నికల తర్వాత కూటమీగా ఏర్పడి గోవా, మణిపూర్, మేఘాలయాల్లో బీజేపీ ప్రభుత్వాన్ని ఏర్పాటు చేసింది. గోవా కాంగ్రెస్ ఇన్‌చార్జి చెల్లకుమార్ ఆధ్వర్యంలో 13 మంది కాంగ్రెస్ సభ్యులు ఆ రాష్ట్ర గవర్నర్ మృదుల సిన్హాను కలసి కాంగ్రెస్ అతి పెద్దపార్టీగా అవతరించినందున ప్రభుత్వ ఏర్పాటుకు ఆహ్వానించి, బలపరీక్షకు ఏడు రోజుల సమయం ఇవ్వాలని మెమోరాండం అందచేశామని గోవా అధికార ప్రతినిధి యతీష్‌నాయక్ వెల్లడించారు. 40 శాసనసభ సీట్లున్న గోవాలో కాంగ్రెస్ 17 స్థానాల్లో విజయం సాధించగా, 13 సీట్లున్న బీజేపీ ప్రభుత్వాన్ని ఏర్పాటు చేసింది. ఇదే పరిస్థితి మణిపూర్, మేఘాలయాల్లో కూడా తలెత్తింది.

కర్ణాటకలో బీజేపీ ఎక్కువ సీట్లు గెలుచుకుని అతిపెద్ద పార్టీగా (104 సీట్లతో) అవతరించినప్పటికీ కాంగ్రెస్, జేడీఎస్‌లకు ప్రభుత్వాన్ని ఏర్పాటు చేసే సంఖ్యాబలం (116మంది సభ్యుల) ఉంది. అయినప్పటికీ ఆ రాష్ట్ర గవర్నర్ వాజూభాయ్ వాలా బీజేపీ అతిపెద్ద పార్టీగా గుర్తిస్తూ ప్రభుత్వ ఏర్పాటుకు ఆహ్వానించిన నేపథ్యంలో ఈ పరిణామం చోటు చేసుకుంది.

# ప్రిన్స్ వివాహానికి 'మైనా'కు ఆహ్వానం

ఆమె







విదేశాల్లో చదువగానే ఏడాదికి ఎన్ని డాలర్లు సంపాదించాలా అని లెక్కలు వేసుకోకుండా, స్వదేశంలోని పేద మహిళలకు ఎలా చేయూతనందించాలా అని ఆలోచించారు సుహానా జలోటా. ముంబై శివారు , అర్బన్ మురికి వాడల్లోని మహిళలకు ఉపాధి కల్పించే విధంగా సామాజిక ఔత్సాహిక వ్యాపారవేత్తగా మారి 'మైనా మహిళా ఫౌండేషన్' స్థాపించిన ఆమెకు బ్రిటన్ రాకుమారుడి పెళ్లికి ఆహ్వానం అందింది. తమ పెళ్లికి బహుమతులు తేవొద్దని వాటికి బదులుగా ప్రపంచ వ్యాప్తంగా ఎంపిక చేసిన చారిటీ సంస్థలకు విరాళాలు అందించాలని నూతన దంపతులు కోరారు. వాటిలో ముంబైలోని మైనా మహిళా ఫౌండేషన్ కూడా ఉంది.

బ్రిటన్ మహారాణి ఎలిజబెత్ కుమారుడు ప్రిన్స్ చార్లెస్ కీశే. దయానాల చిన్నకుమారుడు హ్యారీ వివాహం ఈనెల 19న (శనివారం) మేఘన్ మార్కెల్ (నటి)తో జరిగింది. ఈ పెళ్లికి బ్రిటన్ రాజభవనం నుంచి భారత్‌కు చెందిన రెండు సంస్థలకు ఆహ్వానాలు వచ్చాయి. ఒకటి ముంబైలోని డబ్బావాలాలకు కాగ రెండోది మైనా మహిళా ఫౌండేషన్‌కు. ప్రిన్స్ చార్లెస్ ముంబై పర్యటనలో డబ్బావాలాల విశేష సేవలను చూసి చాలా ఆశ్చర్యం వ్యక్తం చేశారు. అనేక ప్రాంతల నుంచి కర్మాగారాల్లో పనిచేసేవారి ఇంటి నుంచి క్యారేజ్‌లు సేకరించి అవి ఏమాత్రం మారకుండా ఎండ, వర్షం, తుఫాను తేడా లేకుండా సమయానికి ఎవరి బాక్సులు వారికి అందించడం పట్ల ఆయన చాలా సంతృప్తి వ్యక్తం చేశారు. అందుకే వారికి ఆహ్వానం అంది ఉంటుంది.

2015లో మైనా మహిళా ఫౌండేషన్ స్థాపించింది 23 ఏళ్ల సుహానా జలోట డ్యూక్ యూనివర్సిటీ పట్టబద్రురాలు. 2016 సంవత్సరంలోనే ఆమె స్టార్టప్‌కు క్వీన్స్ యంగ్ లీడర్ అవార్డు వరించింది. గతేడాది మార్కెల్ భారత్ సందర్శించిన సందర్భంలో వారు మైనా మహిళా ఫౌండేషన్‌ను సందర్శించారు. మహిళలకు నెలసరిపై మాట్లాడటం భారత్‌లో పెద్దతప్పుగా చూస్తుండటంపై 'మైనా' తన గొంతువిప్పింది. మరీ ముఖ్యంగా ముంబైలోని మురికివాడ మహిళల్లో అవగాహన కలిగించి శానిటరీ న్యాప్‌కిన్స్ వాడకంపై చైతన్యం కలిగించేలా కృషి చేస్తోంది. ఆమె కంపెనీలో 15 మంది పనిచేస్తుండగా,మరో 50 మంది ఇంటింటికీ తిరిగి తక్కువ ధరకు వాటిని అమ్ముతుంటారు. సిబ్బందికి ఇంగ్లీషు, లెక్కలు, ఆత్మరక్షణ, జీవన నైపుణ్యాల పాఠాలు కూడా చెప్పిస్తుంటారు. మైనా అంటేనే మాట్లాడే పక్షి, అంటే మహిళా సమస్యలపై మాట్లాడటం అనే ఉద్దేశ్యంతోనే మైనా మహిళా ఫౌండేషన్‌గా పేరు పెట్టామని జలోటా వివరించారు. 'సహజ వనరుల పరిరక్షణ' కాలుష్యనివారణ, బహిరంగ విసర్జన నివారణ, ఆరోగ్య పరిరక్షణ, మహిళల ఆత్మగౌరవం పెంపొందించడంపై నిరంతరం కార్యక్రమాలు నిర్వహిస్తున్నామన్నారు. ఇప్పటికి నెలకు 10 వేల మందికి శానిటరీ నాప్‌కిన్స్ అందిస్తున్నామని త్వరలో నాలిగింతలుగా దీన్ని అభివృద్ధి చేస్తామని చెబుతున్నారు. యువతులు జొలాటాను ఆదర్శంగా తీసుకొని పేదమహిళలకు ఆలంబనగా నిలవాలి.

## కాలమ్

### కర్ణాటక ప్రజలకు అభినందనలు...

రాజ్యాంగాన్ని రద్దు చేస్తామని భాజపా నేతలు చెప్పినా ఓట్లు వేసారు.
రిజర్వేషన్లు రద్దు చేస్తామని చెప్పినా ఓట్లు వేసారు..
ప్రణాళిక సంఘాన్ని రద్దు చేసినా ఓట్లు వేశారు..
నోట్లను రద్దు చెప్పినా ఓట్లు వేశారు..
దళిత,మైనార్టీ, బలహీన, గిరిజన వర్గాలను
చంపుతున్నా ఓట్లు వేశారు..
బ్యాంకులు నగదు, 95% శాతం ఏటీఎంలు
పని చేయకున్నా ఓట్లు వేశారు..
15 లక్షల రూపాయలు పేద వారి ఖాతాలో వేయకున్నా ఓట్లు వేశారు..
దేశంలో సన్యాసులను ముఖ్యమంత్రులను చేసినా ఓట్లు వేశారు..
బ్యాంకులును ముంచి దేశం విడిచి పారిపోవడానికి
భాజపా సహకారాన్ని ఆందించినందుకు ఓట్లు వేశారు..
దేశంలో ప్రజాస్వామ్యం లేకుండా చేస్తామన్నా ఓట్లు వేసారు..
మైనార్టీలను ఈ దేశం వదిలి వెళ్ళండి అన్నా ఓట్లు వేశారు..
ప్రతి సంవత్సరం 2 కోట్ల ఉద్యోగాలు అని చెప్పారు..
దేశ వ్యాప్తంగా 80 లక్షల ఉద్యోగాలు తీసినా ఓట్లు వేశారు...
దేశంలోచిన్న పిల్లల పైనా హత్యాచారలు జరిగినా ఓట్లు వేశారు...
న్యాయ వ్యవస్థను బ్రష్టు పట్టించినా ఓట్లు వేశారు..
పార్లమెంట్ భవనాన్ని, ఎర్రకోటను మారుస్తామని చెప్పినా
ఓట్లు వేశారు..
భార్యను, గురువును, పార్టీని, రాజ్యంగాన్ని , మోసం చేసినా
ఓట్లు వేశారు..
అందుకే కర్ణాటక ప్రజలకు అభినందనలు...

# కర్నూలు కలెక్టరేట్‌లో ఐసీడీఎస్ సూపర్‌వైజర్ ఆత్మహత్య

- జిల్లా అధికారుల్లో ఆందోళన
- అధికారుల వేధింపులే కారణమా!
- సీడీపీవో, పీడీని అరెస్టు చేయాలంటూ దళిత సంఘాల రాస్తారోకో

**రాజధాని ప్రతినిధి, కర్నూలు** : ఆళ్లగడ్డ ఐసీ డీఎస్ ప్రాజెక్టులోని గ్రేడ్-2 సూపర్‌వైజర్ శోభారాణి (52) కర్నూలు కర్నూలు కలెక్టరేట్‌లోని డీఆర్‌డీఏ భవనం నుంచి దూకి ఆత్మహత్యకు పాల్పడిన ఘటన అలజడి రేపింది. భవనం పైనుంచి దూకడంతో ఆమె అక్కడికక్కడే మృతి చెందారు. డయల్ యువర్ జేసీ కార్యక్రమంలో ఉన్న జాయింట్ కలెక్టర్ ప్రసన్న వెంకటేష్‌కు విషయం తెలియడంతో ఆయన ఘటనాస్థలికి చేరుకున్నారు. ఆత్మహత్యపై ఆరాతీసిన ఆయన మృత దేహాన్ని పరిశీలించారు. 108 వాహనంలో మృతదేహాన్ని ఆసుపత్రికి తరలించారు. శోభారాణి ఆత్మహత్యకు ఐసీడీఎస్ అధికారులే కారణమంటూ కుటుంబ సభ్యులు ఆరోపిస్తున్నారు. కర్నూలు ప్రభుత్వ ఆసుపత్రిలోని మహిళా ప్రాంగణంలో సూపర్‌వైజర్లు, సీడీపీవోలకు రెండు రోజులపాటు శిక్షణ కార్యక్రమాన్ని ఏర్పాటుచేశారు. శిక్షణకు వచ్చిన భోభారాణి ప్రాంతంలో పీడీ కార్యాలయానికి చేరుకున్నారు. భవనంపైకెక్కి ఆత్మహత్య చేసుకోవడంపై అనేక అనుమానాలు వ్యక్తంమౌతున్నాయి. ఆళ్లగడ్డలోని ఐసీ డీఎస్ ప్రాజెక్టులో గ్రేడ్-2 సూపర్‌వైజర్‌గా పనిచేస్తున్న శోభారాణిని సీడీపీవో పద్మ నాలుగేళు ్లగా మానసిక ఒత్తిడి గురిచేస్తోందన్నారు. గత ఏప్రిల్,మే నెలలో సంజాయిషీ నోటీసులు జారీ చేసి సమాధానం ఇవ్వకపోతే సస్పెండ్ చేస్తామని సీడీపీవో హెచ్చరించడం తోనే ఆత్మహత్యకు పాల్పడినట్లు మృతురాలి కుమారుడు పోలీసులకు ఫిర్యాదు చేసినట్లు సమాచారం. ఆళ్లగడ్డలో వేధింపులు జరిగితే కలెక్టరేట్‌లో ఆత్మహత్య చేసుకోవడంతో పీడీ కార్యాతయంలో ఏమి జరిగిందోననే చర్చ సాగుతోంది. శోభారాణి ఆత్మహత్యకు వేధింపులకు పాల్పడిన సీడీపీవోను, పీడీనే బాధ్యత వహించాలని, తక్షణం వీరిని అరెస్టు చేయాలని దళిత సంఘాల నాయకులు కొమ్ముపాలెం శ్రీనివాస్, కేవీపీఎస్ జిల్లా కార్యదర్శి ఆనంద్‌బాబు, రాయలసీమ మాదిగ దండోరా వ్యవస్థాపక అధ్యక్షులు అనంతరత్నం మాదిగ, గిరి, దళిత బహుజన మహిళా సంఘం నాయకురాలు వేల్పుల జ్యోతి తదితరులు డిమాండ్ చేశారు.

## 'జనసేన' ప్రధాన కార్యదర్శిగా తోట చంద్రశేఖర్‌ను నియమించాం: పవన్ కల్యాణ్



**రాజధాని ప్రతినిధి,అమరావతి :** జనసేన పార్టీ ప్రధాన కార్యదర్శిగా ప్రముఖ రాజకీయవేత్త, మాజీ ఐఏఎస్ అధికారి తోట చంద్రశేఖర్‌ను నియమించారు. ఈ మేరకు జనసేన పార్టీ అధినేత పవన్ కల్యాణ్ ఓ ప్రకటన చేసింది. గత పదేళ్లుగా చంద్రశేఖర్‌తో తనకు వ్యక్తిగత సాన్నిహిత్యం ఉందని, ఆయన మంచి పరిపాలనాదక్షుడే కాకుండా విజయవంతమైన పారిశ్రామికవేత్త కూడా అని చెప్పారు. పౌర పరిపాలనలో ఆయనకున్న పట్టు, శక్తిసామర్థ్యాలు అపారమైనవని, చంద్రశేఖర్ దీక్షాదక్షత పార్టీని మరింత విస్తృత పరచడానికి ఉపయోగపడుతుందని అన్నారు. జనసేన పార్టీ ప్రధాన కార్యదర్శిగా తోట చంద్రశేఖర్ త్వరలోనే ప్రమాణస్వీకారం చేస్తారని పేర్కొన్నారు. ఈ కార్యక్రమం ఆంధ్రప్రదేశ్ రాజధాని అమరావతిలో నిర్వహిస్తామని చెప్పారు. చంద్రశేఖర్‌కు పార్టీ శ్రేణులు సంపూర్ణ సహాయ సహకారాలు అందిస్తారని ఆశిస్తున్నానని పవన్ కల్యాణ్ పేర్కొన్నారు.


# రాజధాని క్లాసిఫైడ్స్

## నివాస ప్లాట్లు

**నవులూరు**
రాజధాని ప్రాంతంలోని నవులూరు గ్రామ పరిధిలో **500, 1000** గజముల ప్లాట్లు కావలెను
ఫోన్ :**9440662699**

**రాయపూడి**
రాజధాని ప్రాంతంలోని రాయపూడి గ్రామ పరిధిలో **500, 1000** గజముల ప్లాట్లు కావలెను
ఫోన్ : **9908244333**

నీరుకొండ
రాజధాని ప్రాంతంలోని నీరుకొండ గ్రామ పరిధిలో **500, 1000, 2000** గజముల ప్లాట్లు కావలెను
ఫోన్:**9440662699**

## ఇతరములు

**తుళ్ళూరు**
ఎస్.ఎమ్(స్టైల్ ఫర్ మెన్) ట్రైలర్స్
ఫోన్ **9440307123**

వెంకటపాలెం
సాయిలాస్య రియల్‌ఎస్టేట్ & ఫైనాన్స్ కన్సెల్టెన్సీ, గాదె నాగేశ్వరరావు
ఫోన్ : **951515393**

**మందడం**
ఎస్.ఆర్.కె. గ్రాండ్ రెస్టారెంట్
ఫోన్ : **9553023388**

**వెలగపూడి**
సాయి గణేష్ ట్రెడర్స్: నిర్మాణ రంగానికిసిమెంట్, స్టీలు, పైపులు, పెయింట్‌లు అమ్మబడును.
ఫోన్ : **9640811333**

**రాయపూడి**
చంద్రిక ట్రెడర్స్ నిర్మాణ రంగానికి సిమెంట్, స్టీలు,పైపులు అమ్మబడును.
ఫోన్ : **9908073516**

**రాయపూడి**
రియల్‌ఎస్టేట్ క్రయ,విక్రయాలకు సంప్రదించడం న్యూసింగపూర్ రియల్ ఎస్టేట్
ఫోన్ : **9848442436**

**రాయపూడి**
కాకతీయ ఫుడ్ కోర్ట్
ఫోన్ **9848021898**

## షాప్స్

**తుళ్ళూరు**
రేమాండ్స్‌ట్రైలర్స్
ఫోన్ : **9492470426**

**రాయపూడి**
వర్షిత ఫోటోస్టాట్
ఫోన్ : **9985853188**

**తుళ్ళూరు**
వైభవ్ డ్రస్సెస్
ఫోన్ : **9848407935**

**తుళ్ళూరు**
రాజా గోల్డ్ కవరింగ్
ఫోన్ : **9581500500**

**తుళ్ళూరు**
శ్రీసాయి జ్యూయలరీ వర్క్స్
ఫోన్ :**9247171083**

**రాయపూడి**
ఖాజా ఖాదర్ రైస్ స్టోర్స్
ఫోన్ : **9603990791**

## హస్పటల్స్

**విజయవాడ**
ఆంధ్ర హస్పటల్, డా॥శ్రీమన్నారాయణ
ఫోన్ : **9177219900**

**విజయవాడ**
ఇంధిరారావు మెడికేర్ (సెంటర్)
ఫోన్ : **9440421580**

**విజయవాడ**
న్యూఫేస్ కీనిక్ , డా॥మేహబూబ్
ఫోన్ : **9849122788**

**విజయవాడ**
అష్రఫ్ మెటర్నిటీ & ఇ.ఎన్‌టి డా॥ రెహమాన్
ఫోన్: **0866-2475087**

**విజయవాడ**
శ్రీమానస సైకియాట్రిక్ డా॥ అయోధ్య ఆర్.కె
ఫోన్:**0866-2436647**

విశాఖపట్నం
చింతలూరు ఆయుర్వేద డా॥ విశ్వనాథ్
ఫోన్ :**90329 90138**

## వాణిజ్య ప్లాట్లు

**నవులూరు**
రాజధాని ప్రాంతంలోని నవులూరు గ్రామ పరిధిలో **500, 1000, 2000** గజముల ప్లాట్లు కావలెను
ఫోన్ : **9440662699**

**ఐనవోలు**
రాజధాని ప్రాంతంలోని ఐనవోలు గ్రామ పరిధిలో **500, 1000, 2000** గజముల ప్లాట్లు కావలెను
ఫోన్ : **9908244333**

నీరుకొండ
రాజధాని ప్రాంతంలోని నీరుకొండ గ్రామ పరిధిలో **500, 1000, 2000** గజముల ప్లాట్లు కావలెను
ఫోన్ : **9440662699**

## విద్యా సంస్థలు

ఐనవోలు
విఐటీ-ఏపీ యూనివర్శిసిటీ
ఫోన్ :**0863 2370444**

నీరుకొండ
ఎస్ఆర్ఎమ్ యూనివర్శిసిటీ
ఫోన్ :**0863 2343000**

**గమనిక : క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగిన రీతిలో క్షుణ్ణంగా విచారించు కోవసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు చెబుతున్న లేదా చేసుకుంటున్న క్లెయిములతో ఈ వార్తాపత్రికకు ఏ విధమైన సంబంధం లేదు. ప్రకటన దారులు సరుకుల అమ్మకం లేదా అందించిన సేవల విషయంలో తప్ప, ప్రకటనల ద్వారా ప్రజల నుండి ఎట్టి డబ్బును వసూలు చేయరాదు. డబ్బును వసూలు చేసే ప్రకటనకర్తను బ్లాక్-లిస్టులో ఉంచే మరియు/ లేదా అతనిపై చట్టరమైన చర్య తీసుకునే హక్కు యాజమాన్యానికి కలదు.**

**- మేనేజర్**

ప్రకటనలకు సంప్రదించండి 9493170689


# ఇక సర్కారీ బడుల్లో ఎల్‌కేజీ

- మార్గదర్శకాలు సిద్ధం చేస్తున్న ఏపీ ప్రభుత్వం
- వచ్చె విద్యా సంవత్సరం నుంచి అమలుకు యోచన
- దీనికి కేంద్రం సహకారం



**రాజధాని ప్రతినిధి, అమరావతి :** ఆంధ్రప్రదేశ్‌లోని ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలల్లో ప్రీ-ప్రైమరీ విద్య (ఎల్‌కేజీ-యూకేజీ)లను ప్రవేశ పెట్టాలని ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం యోచిస్తోంది. వచ్చేవిద్యా సంవత్సరం నుంచి అమలు చేసేందుకు మార్గదర్శకాలను సిద్ధం చేస్తోంది. ఉపాధ్యాయ విద్య, రాష్ట్రయ మాధ్యమిక శిక్షా అభియాన్, సర్వ శిక్షా అభియాన్‌లను మెరుగుపరచి సమగ్ర శిక్షా అభియాన్ ఎల్‌కేజీ నుంచి సంపూర్ణ నాణ్యత కలిగిన విద్యను అందిం చడానికి కేంద్ర ప్రభుత్వం తీసుకున్న నిర్ణయానికి అనుగుణంగా ఏపీ ప్రభుత్వం ఈ చర్యకు ఉపక్రమించింది. దీనిని ఏవిధంగా ముందుకు తీసుకువెళ్లాలనే విషయమై ఇప్పటికే కేంద్ర ప్రభుత్వం అన్ని రాష్ట్రాలకు మార్గదర్శకాల సెట్‌ను పంపింది. ఎస్ఎస్ఏ, ఆర్ఎంఎస్ఏ ద్వారా రాష్ట్రంలో విద్యపై వ్యయానికి సంబంధించి ప్రధాన వాటాను కేంద్ర ప్రభుత్వం భరిస్తోంది. కాగా ఇతర రాష్ట్రాలతోపాటు 2018-19 నుంచి సమగ్ర శిక్షా అభియాన్ అమలుకు ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం కూడా అంగీకరించింది. విద్యా సంవత్సరం ప్రారంభ సమ యం ఆసన్నమైనందున, ఇప్పుడు అధికారులు ప్రాథమిక పాఠశాలల్లో కిండర్ గార్టెన్ విద్యను ప్రవేశపెట్టాలని నిర్ణయించారు. ప్రభుత్వ పాఠశాలల్లో పూర్వ ప్రాథమిక విద్యను విద్యాశాఖ ప్రవేశపెట్ట నున్నట్లు ఉన్నతిధికారి ఒకరు తెలిపారు. సమగ్ర శిక్షా అభియాన్ కింద పాఠశాల విద్యా వ్యవస్థలో భాగంగా ఈ పూర్వ ప్రాథమిక విద్య ఉం టుందన్నారు.' మేము ప్రణాళిక తయారు చేశాం. ప్రభుత్వ ఆమోదానికి పంపాం' అని అధికారి చెప్పారు. ప్రాథమిక విద్యకు ముందు పూర్వ ప్రాథమిక విద్యను అభ్యసించిన చిన్నారులు విద్యలో చురుకుగా ఉంటున్నారని జాతీయ విద్యా ప్రణాళిక సంస్థ, నీతి ఆయోగ్‌ల సర్వేలో వెల్లడ య్యింది. అందువల్ల ప్రభుత్వ పాఠశాలల్లో ప్రీ-ప్రైమరీ విద్యను ప్రవేశపెట్టాల్సిన అవసరం ఉందని ప్రభుత్వం భావిస్తోంది.

## నాలుగో తరగతి ఉద్యోగుల సంఘం రాష్ట్ర కార్యవర్గ ఎన్నిక

**రాజధాని ప్రతినిధి, కలెక్టరేట్(గుంటూరు) :** ఆంధ్రప్రదేశ్ పంచాయతీరాజ్ నాలుగో తరగతి ఉద్యోగుల సంఘం రాష్ట్ర కార్యవర్గ ఎన్నిక గుంటూరు జిల్లా పరిషత్తు ప్రాంగణంలోని యూనియన్ కార్యాలయంలో జరిగింది. పశ్చిమ గోదావరి జిల్లా సంఘ కార్యదర్శి జి.ఆర్.సూర్యనారాయణరాజు ఎన్నికల అధికారిగా వ్యవహరించారు. సంఘం గౌరవాధ్యక్షుడిగా కె.గోవిందరాజులు (పశ్చిమ గోదావరి), అధ్యక్షులుగా వి.లక్ష్మయ్య (గుంటూరు), కార్యదర్శిగా ఎన్.భీమి రెడ్డి (నెల్లూరు), అసోసి యేట్ అధ్యక్షులుగా జె.శ్రీరామమూర్తి (కృష్ణా), ఉపాధ్యక్షులు కె.టి.ఆర్.ఎన్.ప్రసాదరావు (విశాఖ), వై.పోలయ్య (ప్రకాశం), వి.ఎల్.ప్రకాష్ (విజయనగరం), ఎస్.వరదరాజులు(చిత్తూరు), సంయుక్త కార్యదర్శిగా బి.మోహన్ (చిత్తూరు), ఎన్.టిప్పుస్వామి (అనంతపురం), ఆర్.బి.వి.కృష్ణారావు (కర్నూలు), కోశాధికారిగా ఎ.రామకృష్ణ (ప.గో), ఆరుగురు ఆర్గ నైజింగ్ కార్యదర్శులు, 11 మంది ఎగ్జిక్యూటివ్ సభ్యులను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు.

## వికేంద్రీకరణతోనే అభివృద్ధి: అజయ్‌కల్లం

**రాజధాని ప్రతినిధి, కడప :** ప్రతి ఒక్కరిలో ప్రశ్నించేతత్వం.. నిలదీసే ధైర్యం రావాలి.. ఈ రెండు సీమ ప్రాంతవాసుల్లో చాలా తక్కువగా ఉన్నాయి.. అవేసీమ వెనుకబాటుకు కారణమని విశ్రాంత ఐఏఎస్ అధికారి అజయ్ కల్లం అభిప్రాయపడ్డారు. ఎక్కడైతే వికేంద్రీకరణ జరుగుతుందో ఆ ప్రాంతం అభివృద్ధి చెందుతుందని చెప్పారు. కడపలో రాయలసీమ అభివృద్ధి ఫోరం ఆధ్వర్యంలో 'మన కోసం-మనం' అనే అంశంపై చైతన్య చర్చాగోష్ఠి నిర్వహించారు. కార్యక్రమానికి ఫోరం అధ్యక్షుడు సీహెచ్.చంద్రశేఖర్‌రెడ్డి అధ్యక్షత వహించారు. ఈ సందర్భంగా అజయ్‌కల్లం మాట్లాడుతూ.. దేశవ్యాప్తంగా ప్రతి ఏడాది 16 లక్షల మంది ఇంజినీర్లు బయటికి వస్తున్నారు. అవసరానికి మించి రావడంతో నిరుద్యోగ సమస్య ఎదురవుతోందని పేర్కొన్నారు. చైనా దేశం వ్యవసాయంలో చేస్తున్న పరిశోధనలు చూస్తుంటే అమెరికాకు భయం పుట్టుకొస్తోందన్నారు. అలాంటి పరిశోధనలు మన మన దేశంలో లేకపోకవడం శోచనీయమన్నారు. మన దేశంలో విశ్వవిద్యాలయాలకు రాజకీయ నాయకులకు దగ్గర సంబంధం ఉంటోందని, దీని వల్ల విద్యావ్యవస్థ వారి చేతుల్లోకి వెళ్తుందన్నారు. కార్యక్రమంలో మాజీ మంత్రి సి.రామచంద్రయ్య తదితరులు పాల్గొన్నారు.

## జూన్10న విజయవాడలో రాష్ట్ర స్థాయి కవి సమ్మేళనం

**రాజధాని ప్రతినిధి, అనకాపల్లి:** 'మన ఆంధ్రప్రదేశ్' అనే అంశంపై జూన్ 10 విజయవాడలో రచయితల సంఘ కార్యలయంలో రాష్ట్రస్థాయి ఏకదిన కవిసమ్మేళనాన్ని నిర్వహించనున్నట్లు ఏపీ రచయితల సంఘం విశాఖ జిల్లా ఉపాధ్యక్షురాలు మాధవీ సనారా ఒక ప్రకటనలో తెలిపారు. ఏపీలోని 13 జిల్లాల్లో చారిత్రక, భౌగోళిక, సామాజిక అంశాలు, ఆయా నగరాల సంస్కృతి, సంప్రదాయాలు, ఇక్కడ పుట్టిన విశిష్ట వ్యక్తుల గొప్పతనాన్ని చాటేరీతిలో కవులు తమ కవితలను 40 పంక్తులకు మించకుండా చదివి వినిపించాలని ఆమె పేర్కున్నారు. ఏపీ రచయితల సంఘం, పోస్ట్‌బాక్స్ నెం-5, విజయవాడ - 520001 చిరునామాకు కవులు లేఖలు పంపాల్సి ఉంటుందని తెలిపారు.

## సుప్రసిద్ధ కథారచయిత పెద్దిభొట్ల సుబ్బరామయ్య కన్నుమూత!

- కొన్నేళ్లుగా కాలేయ సంబంధిత వ్యాధితో బాధపడుతున్న పెద్దిభొట్ల
- విజయవాడలో చికిత్స పొందుతూ మృతి

ప్రముఖ రచయిత, కేంద్ర సాహిత్య అకాడమీ పురస్కార గ్రహీత పెద్దిభొట్ల సుబ్బరామయ్య (82) కన్నుమూశారు. కొన్నేళ్లుగా కాలేయ సంబంధిత వ్యాధితో బాధపడుతున్న ఆయన విజయవాడలోని ఓ ప్రైవేటు ఆసుపత్రిలో చికిత్స పొందుతూ ఈరోజు తుదిశ్వాస విడిచారు. పెద్దిభొట్ల మృతిపై సాహితీ రంగానికి చెందిన వారితో, ఇతర రంగాలకు చెందిన పలువురు ప్రముఖులు తమ సంతాపం వ్యక్తం చేశారు. కాగా, పెద్దిభొట్ల గుంటూరులో జన్మించారు. పాఠశాల విద్యను ఒంగోలులో అభ్యసించారు. ఉన్నతవిద్యను విజయవాడలో కొనసాగించారు. విజయవాడలోని ఆంధ్రా లయోలా కాలేజీలో లెక్చరర్ గా నలభై ఏళ్లు అధ్యాపకుడిగా పని చేశారు. 1996లో పదవీ విరమణ చేశారు. ఇక, ఆయన సాహిత్య ప్రస్థానం గురించి చెప్పాలంటే.. కాలేజీ విద్యనభ్యసించే రోజుల్లో ప్రముఖ రచయిత విశ్వనాథ సత్యనారాయణ వద్ద ఆయన శిష్యరికం చేశారు. పెద్దిభొట్ల రాసిన తొలికథ 'చక్రనేమి'. 'పూర్ణాహుతి', 'దుర్దినం', 'శుక్రవారం', 'ఏస్ రన్నర్', కథా సంకలనం 'వీళ్ళు' తదితర కథలు రాశారు. సుమారు 200కు పైగా కథలు రాశారు. 'ముక్తి', 'చేదుమాత్ర' వంటి నవలలు మొత్తం 8 రాశారు. సాహిత్య రంగంలో ఆయన చేసిన కృషికి గాను 2012లో కేంద్రసాహిత్య అకాడమీ పురస్కారం లభించింది. రావిశాస్త్రి సాహిత్య స్మారకనిధి, గోపీచంద్ స్మారక అవార్డు, అప్పాజోస్యుల విష్ణుభొట్ల కందాలం ఫౌండేషన్ వంటి పలు ప్రతిష్ఠాత్మక అవార్డులు, సన్మానాలు పెద్దిభొట్లకు లభించాయి.

## 2000 లో తన కవితాసంపుటి "పరికిణీ" లో మహానటి సావిత్రి పై తనికెళ్ళ భరణి వ్రాసిన కవిత..ఇది

నవర 'సావిత్రి'
త్రికాలాలకి అతీతమైన త్రివిక్రమ స్వరూపం.
నటరాజుకి స్త్రీ రూపం.
సావిత్రి కొంగు
నిర్మాతలకి బంగారం.
ఆవిడ కన్యాశుల్కంలో నవ్వితే
మధురవాణే డంగైపోయింది.
మాయాబజార్ లో
ఘటోత్కచుడ్ని అనుకరిస్తే
రంగారావే కంగారుపడ్డాడు.
ఆమె నాయికైతే ప్రేక్షకుడే నాయకుడు.
ఆమె చెల్లి అయితే ప్రేక్షకుడే అన్న.
ఆమె పార్వతైతే
ప్రేక్షకులంతా దేవదాసులే.
కోమాలో ఆమెను చూస్తే...
పాడుబడ్డబావిలో తేలే చందమామలాగా
పతనమైన విజయనగర సామ్రాజ్య వైభవంలాగా
శిథిలమైన వేయిస్తంభాల గుడిలాగా
ఓడరేవులో లైట్లారిపోయిన
ఒంటరి దీపస్థంభంలాగా ఉండేది.
"న భూతో న భవిష్యతి"
ఒక్క సావిత్రికే ఈ
వాక్యం వాడొచ్చు.

### తుళ్లూరు మండలంలో అధికారుల ఫోన్ నెంబరు

| | |
|---|---|
| ఎంపీడీవో | 7032983520 |
| పీఆర్- ఏఈ | 8885356111 |
| ఈవోపీఆర్డీ | 7893278555 |
| ఆర్‌డబ్ల్యుఎస్-ఏఈ | 9100121445 |
| తహసీల్దార్ | 9849904017 |
| ఎంఈవో | 9441503313 |
| వ్యవసాయాధికారి | 8886614089 |
| వెలుగు ఏపీఎం | 8978804969 |
| సీడీపీవోవో | 9491051608 |
| హౌసింగ్-ఏఈ | 7093930790 |
| ఎలక్ట్రిసిట్ -ఏఈ | 9440812300 |
| వైద్యాధికారి | 9912213633 |
| సాక్షర భారతి ఎంసీవో | 9703183931 |
| సర్కిల్ ఇన్‌స్పెక్టర్ | 9440900860 |

# త్యాగాలకు ఇదా గుర్తింపు ..

**ప్రభుత్వాలు ప్రజల సమస్యలను అలక్ష్యం చేస్తున్నాయన్నది ఒకప్పటి ప్రధాన సమస్య. ప్రభుత్వాలే ప్రజలపై వేధింపులకు పాల్పడటం ప్రస్తుత సమస్య. ఈ క్రమంలో దేశంలోని ప్రజాస్వామ్య వ్యవస్థలన్నీ రాజకీయ ఆక్టోపస్ చేతిలో నిర్వీర్యమై పోయాయి. దీంతో దేశానికి సేవలందించేవాళ్లే నిందితులుగా మారుతుండగా, గప్పాలు కొట్టుకునేవారు పాలకులుగా అవతారమెత్తారు.**



ముస్లింలపై బీజేపీ అనుబంధ సంస్థలు ఆర్ఎస్ఎస్, వీహెచ్‌పీ,భజరంగ్‌దళ్ వంటి హిందూ మతోన్మాద సంస్థలు అకృత్యాలు జరుపుతుంటే ప్రభుత్వం పట్టనట్టు వ్యవహరిస్తోంది. ఎదిరించిన వారిని నామరూపాలు లేకుండా చేయడంలో ఈ సంస్థలు ఎంతో ఉత్సుకతతో పనిచేస్తున్నాయి. పైగా దళితులను ఊచకోత కోసి దళిత రాష్ట్రపతిని, మైనార్టీలపై మారణహోమం జరిపి ముస్లీమును రాష్ట్రపతి చేస్తుంటాయి ఈ ప్రభుత్వాలు. కాని ఈ దేశ సరిహద్దుల్లో దివారాత్రాలు పనిచేసేది మాత్రం ఈ మైనార్టీలు, దళితులు అన్నది నగ్న సత్యం. ఒక వైపు వారి అసమాన సేవలు ఉపయోగించుకుంటూ, మరో వైపు వారిపైనే దాడులు జరపడం అత్యంత హేయం.వారి త్యాగాలతో సుఖవంతమైన పదవులు అనుభవిస్తూ ..వారినే ముద్దాయిలుగా చూస్తున్న ప్రభుత్వంపై ఎంఐఎం నేత అసదుద్దీన్ ఒవైసీ విమర్శలు కురిపిస్తూ, కాశ్మీరుఘర్షణల్లో, సరిహద్దు భద్రతలో ప్రతిరోజూ ఎంతోమంది ముస్లింలు తమ ప్రాణాలు పోగొట్టుకుంటున్నా ఈ దేశం వారిని ఇంకా ఉగ్రవాదులుగానే చూస్తూ వేధిస్తోందని వాపోయారు. దీంతో ఒవైసీ సైన్యంలో కులతత్వాన్ని ప్రోత్సహిస్తున్నారంటూ ఆర్మీచీఫ్ జనరల్ బిపిన్ రావత్‌తో సహా అందరూ ఆయనపై మండిపడ్డారు. ఈ దేశం బాధను కూడా బయటకు చెప్పుకోనీయకుండా చేస్తుందనడంలో ఇంతకంటే నిదర్శనం ఏముంది? నిజానికి బీజేపీ సైన్యంలో కూడా కులమతాల చిచ్చుపెట్టిందని మూడేళ్ల క్రిందటే వాపపక్ష పార్టీ పత్రిక 'న్యూయేజ్' వెల్లడించింది.

ఇంకొక ఆశ్చర్యకరమైన విషయం ఏమంటే ఉపరాష్ట్రపతి వెంకయ్య నాయుడు కేరళలోని ఒక కార్యక్రమంలో దీనిని పరోక్షంగా ప్రస్తావిస్తూ రాజకీయాలను, మతాలను కలపొద్దని హెచ్చరిస్తూ, మతం వ్యక్తిగతమని చెప్పారు. అంతేకాదు ఈ దేశంలో రాముడు,కృష్ణుడు, ఏసుక్రీస్తు, అల్లాహ్‌లను ప్రార్థించుకోవచ్చని సెలవిచ్చారు. మరి బాబ్రీమసీదును కూల్చి, రామమందిర నిర్మాణం పేరుతో అధికారంలోకి వచ్చిన బీజేపీ నుంచేకదా ఆయన పార్టీ, మంత్రిపదవులు చేపట్టింది...

**ఎవరైనా ఎన్నికల్లో పోటీ చేయాలంటే సైన్యంలో పనిచేసి ఉండాలన్న కనీస నియమనిబంధన పెడితే ఇలాంటి రాజకీయ నాయకుల నుంచి ప్రజలకు ఊరట కలుగుతుంది. అనేక దేశాల్లో ఈ పద్ధతి అమలు జరుగుతోంది. ఈ కులమతాల కుంపట్లోనే అందమైన కాశ్మీరం అట్టుడికిపోతోంది.**

### కాశ్మీర్ సంవిలీనం ..

భారతదేశానికి స్వాతంత్ర్యం వచ్చాక స్వతంత్ర దేశంగా ఉండటానికే జమ్ముకాశ్మీర్ రాజు హరిసింగ్ నిర్ణయించుకున్నారు. అయితే అప్పటికే రాచరికపు పోకడలతో విసిగిపోయిన అక్కడి ప్రజలను ఏకం చేసి అందరికీ సమానత్వం ఉండే ప్రజాస్వామ్యంలో ఉండాలన్న ఉద్దేశంతో షేక్ అబ్దుల్లా పోరాటాలు చేశారు. కాశ్మీర్ పాకిస్థాన్‌తో కలసి పోతుందని ఆశించిన ఆదేశానికి ఈ నిర్ణయం మింగుడు పడలేదు. అందుకే గెరిల్లాదాడులను ,సాయుధులను వారిపైకి ఉసిగొల్పింది. అయితే భారత సైన్యం సాయంతో వీటిని కాశ్మీర్ ప్రజలు విజయవంతంగా తిప్పికొట్టారు. ఈ ప్రత్యేక పరిస్థితుల్లో కాశ్మీర్ ప్రజలు స్వయంప్రతిపత్తి కోల్పోకుండా భారత్‌లో విలీనం కావడానికి ఒప్పుకున్నారు. దీనిని భారత ప్రభుత్వం, రాజ్యాగం, పార్లమెంటు ఒప్పుకున్నాయి. ఈ సంవిలీన ఒడంబడికను రాజ్యాంగంలో చేర్చింది. దీనికి సంబంధించిందే రాజ్యాంగంలోని ఆర్టికల్ 370. ఈ క్రమంలో షేక్ అబ్దులా తిరుగులేని నాయకుడిగా ఎదిగి కాశ్మీర్ సీఎం అయ్యారు.

### రగులుతున్న కాష్ఠం

అయితే రానురాను రాజకీయాలు నిరంకుశంగా తయారయ్యాయి. కాశ్మీర్ షేర్‌ఖాన్‌గా పిలుచుకొనే షేక్ అబ్దుల్లా కుట్రలకు పాల్పడ్డారని అప్పటి కాంగ్రెస్ ప్రభుత్వం జైల్లో పెట్టించింది. ఆయన కుటుంబంలో కలహాలు రేపి మూడు గ్రూపులుగా విడిపోయేట్టు చేసింది. దీంతో అక్కడి ప్రజలు ఆవేదన చెందారు . ఇందుకేనా భారత్‌లో విలీనమయ్యామని ఆక్రోషించారు. ఈ పరిస్థితిని పాకిస్థాన్ సానుకూలంగా మార్చుకుంది. అక్కడి యువతకు ఉగ్రవాదంలో శిక్షణ ఇచ్చింది. ఇంత జరుగుతున్నా భారత ప్రభుత్వం మాత్రం ఇంటిని చక్కదిద్దుకునే ప్రయత్నం చేయలేదు. వారిని ఊరడించేందుకు గాని, వారిలో అభద్రతా భావం పోగొట్టడానికి గాని చర్యలు తీసుకోలేదు. దీంతో వారంతా పరాయీకరణ భావనలో ఉండిపోయారు. ప్రభుత్వాల తీరుతో విసిగిపోయిన యువత ఉగ్రవాదులుగా మారుతుంటే ప్రభుత్వం వారిని తుపాకీ గొట్టాల ద్వారా అణగదొక్కాలని చూస్తుందే కాని అక్కడి పరిస్థితులను అర్థం చేసుకొని ప్రజలకు బాటగా ఉందామన్న కనీస ఆలోచన చేయకపోవడం విచారకరం. ప్రత్యేక ప్రతిపత్తి కోసం ఆర్టికల్ 370కి అధిక ప్రాధాన్యం ఇచ్చే పీపుల్స్ డెమాక్రటిక్ పార్టీ ( పీడీపీ)తో సుస్థిర పాలన వస్తుందన్న ఆశతో అక్కడి ప్రజలు ఆపార్టీకి పట్టంకట్టారు. ఇందుకోసం వారు వేర్పాటువాదుల హెచ్చరికలను, హింసను కూడా లెక్కచేయలేదు. అయితే జరిగిందేమిటి కాశ్మీర్‌లో పీడీపీ ప్రభుత్వం ఏర్పాటు చేసిన ముఫ్తీ మహ్మద్ సయ్యద్ మరణ తర్వాత ఆమె కుమార్తె మెహబూబా ముఫ్తీ మూడు నెలలపాటు ప్రధాని మోడీ చుట్టూ తిరిగి స్వయం ప్రతిపత్తి ఆర్టికల్ 370ని రద్దుచేసే అలోచనలో ముందుకు సాగుతున్న బీజేపీతో కలసి ప్రభుత్వాన్ని ఏర్పాటు చేసింది. దీంతో కాశ్మీర్ ప్రజలు మరొకసారి హతాశురులయ్యారు. ఈనేపథ్యంలో విద్యార్థులు భద్రతాదళాలపై రాళ్లు రువ్వుతున్నారు. భారత్‌కు వ్యతిరేకంగా నినాదాలు చేస్తున్నారు. బీజేపీ ప్రభుత్వం ఈ సమస్యకు పరిష్కారం కాకుండా రెచ్చగొట్టే చర్యలకు దిగుతోంది. స్వయం ప్రతిపత్తికి నిరాకరిస్తోంది. అంటే ఒక్కసారి భారత పార్లమెంటులో చట్టం చేసిన దానిని_ అన్నిరాష్ట్రాలమాదిరిగానే కాశ్మీరులో కూడా అమలు చేయాలని చూస్తోంది. కాని జమ్మూ కాశ్మీర్‌లో మాత్రం అక్కడి అసెంబ్లీ ఆమోదించాకే అది చట్టంగా రూపొందే ప్రత్యేక హక్కును హరించే దశలో బీజేపీ ముందుకెళుతోంది.

### సామాజిక స్థితులపై అధ్యయనం అవసరం

ఉగ్రవాదంలో ముఖ్యపాత్ర పోషించేది మతతత్వమే.. అయితే ఇది చదువుకోని వారిలో ఎక్కువగా ఉంటుందన్నది ప్రజల అభిప్రాయం అయితే, మే5న భద్రతాదళాలకు, ఉగ్రవాదులకు జరిగిన కాల్పుల్లో రఫీభట్ అనే ప్రొఫెసర్ చనిపోవడంతో ప్రపంచం ఉలిక్కి పడింది. కాశ్మీర్ వర్సిటీలో ఆయన సోషియాలజీలో ప్రొఫెసర్‌గా పనిచేస్తున్నారు. ఆయన ఉగ్రవాదుల్లో చేరడానికి కొద్ది సమయం ముందు ఇండియన్ సొసైటీ, స్ట్రక్చరిలిజంపై విద్యార్థులకు పాఠాలు చెప్పారు. పీహెచ్‌డీ పట్టా పొందిన వ్యక్తే కాకుండా యూజీసీ ఆధ్వర్యంలో రీసెర్చ్ స్కాలర్‌గా గ్లోబలైజేషన్ అండ్ ఇట్స్ ఇంపాక్ట్స్ ఫ్రం కన్స్యూమరిజం, ఎ కంపారిటివ్ స్టడీ ఆఫ్ రూరల్ అండ్ అర్బన్ జమ్ముకాశ్మీర్ పై పరిశోధన చేసిన విద్యావంతుడు. ఆయన హిజబుల్ ముజాహిద్దీన్‌లో చేరిన కొద్ది గంటల్లోనే మరణించాడు. అంటే చదువుకోని వారిలో కాకుండా అత్యున్నతంగా చదువుకున్న వారిని కూడా ఉగ్రవాదం ఆకర్షిస్తుందంటే అందుకు కారణాలను తెలుసుకోవడంలో అలసత్వం పనికిరాదు. తక్షణమే కాశ్మీర్ రాజకీయ, సామాజిక పరిస్థితులపై హేతుబద్ధంగా, లోతైన అధ్యయనం జరగాలి.

### శాశ్వత పరిష్కారం కావాలి

సర్జికల్ స్ట్రైయిక్స్, లేదంటే అణుపరీక్షలతోనో, నవాజ్ షరీఫ్ ఇంటికి భారత ప్రధాని ఒంటరిగా వెళ్లి వస్తేనో, అమెరికా అధ్యక్షుడిగా డొనాల్డ్ ట్రంప్ ఎన్నికైన తర్వాత పాక్‌ను నిలువరిస్తేనో కాశ్మీర్ సమస్య తీరుతుందని నమ్మడం కేవలం అపోహమాత్రమే అని భారత ప్రభుత్వం తెలుసుకోవాలి.

భారత ప్రభుత్వానికి భారత ప్రజలతో మాట్లాడటానికి ఎటువంటి భేషజాలు ఉండకూడదు. వేర్పాటు వాదులలతో కూడా మాట్లాడాలి. (వాజ్‌పేయి ప్రభుత్వంలో ఇవి జరిగాయి) షరతులు,అభ్యంతరాలు లేకుండా తక్షణమే చర్చలు జరపాలి. ఇదే సమయంలో పాక్‌తోకూడా చర్చించాలి. అంతిమంగా కాశ్మీర్ ప్రజల హృదయాలను గెలవాలి. హింసకు పాల్పడేవారిపై సైన్యాన్ని ఉపయోగించాలి. భారత రాజ్యాంగానికి లోబడి ,భారత సార్వభౌమత్వానికి కట్టుబడి కాశ్మీరీలకు స్వయం ప్రతిపత్తి కల్పించాల్సిన బాధ్యత భారత ప్రభుత్వానిదే.. అదే సమయంలో ఆక్రమిత కాశ్మీరును కూడా మనదేశంలో కలుపుకుంటానికి భారత్ ముందడుగు వేయాలి.

కాశ్మీర్‌లో ఇప్పటివరకు 10 వేల మంది మహిళలపై ఇండియన్ ఆర్మీ అత్యాచారాలు జరిపాయని ఇందులో ఏడేళ్ల బాలికల నుంచి 77 ఏడేళ్ల వృద్ధ మహిళలు ఉన్నారని ఐక్యరాజ్యసమితి వెల్లడించింది.

(రంజాన్ సందర్భంగా ప్రపంచవ్యాప్తంగా ముస్లింలు అనుభవిస్తున్న శ్రమలు, మరీ ముఖ్యంగా కాశ్మీరీయులకోసం ప్రార్థించుదాం...)

– ఖాన్



**కాశ్మీరుఘర్షణల్లో, సరిహద్దు భద్రతలో ప్రతిరోజూ ఎంతోమంది ముస్లింలు తమ ప్రాణాలు పోగొట్టుకుంటున్నా ఈ దేశం వారిని ఇంకా ఉగ్రవాదులుగానే చూస్తూ వేధిస్తోంది.**

**సైన్యంలో కులతత్వాన్ని ప్రోత్సహిస్తున్నారు.**





## భూలోక స్వర్గం కాశ్మీర్

ప్రకృతి దృశ్యాలకు, వెండిలా మెరిసిపోయే మంచుకొండలకు, ప్రపంచంలోనే మేలైన తులిప్ పూల సౌందర్యానికి, స్వచ్ఛమైన నీటికి ఆనవాలంగా దాల్ లేక్ (సరస్సు), అత్యంత ఖరీదైన కుంకుమ పూవులను ఉత్పత్తి చేసే రాష్ట్రంగా ఇది ప్రపంచ ప్రఖ్యాతి గాంచింది. ఇక్కడి ప్రజలు చాలా సౌమ్యులు. కాశ్మీరీ పండిట్లు, ముస్లింలు ఒకరి మతంపై మరొకరు గౌరవభావం కలిగి ఉంటారు. నిజం చెప్పాలంటే సూఫీ ఇస్లాం, కాశ్మీరీ పండిట్లది అద్భుత సహజీవనం. దేశ విభజనలో ఉత్తరాది రాష్ట్రాలన్నీ రక్తపాతంతో తడిసిపోతే.. ఇక్కడి ప్రజలు మాత్రం రక్తపుబొట్టు కూడా చిందించ కుండా శాంతిసౌభ్రాతృత్వాల మధ్య జీవించిన చరిత్ర వారిది. అయితే ప్రస్తుత పరిస్థితులు ఎంతలా మారిపోయాయో మనందరికీ తెలుసు ...



క్వీన్ విక్టోరియా, ప్రిన్స్ అల్బర్ట్



క్వీన్ ఎలిజబెత్, ఫిలిప్



ప్రిన్స్ చార్లెస్, డయానా



ప్రిన్స్ విలియమ్, కేథరిన్

## రాజకుమారుడికి తలపాగా బహుమతి

**ముంబై :** బ్రిటన్‌లోని రాయల్ వెడ్డింగ్‌కు ముంబయిలోని డబ్బావాలాలు ప్రత్యేకంగా బహుమతి పంపారు. పెళ్లి కొడుకు బ్రిటన్ రాకుమారుడు ప్రిన్స్ హ్యారీ కోసం తలపాగా , పెళ్లికుమార్తె మేఘన్ మార్కెల్ కోసం చీర బహుమతిగా పంపారు. బ్రిటన్ రాజ కుటుంబానికి డబ్బావాలాలకు చాలా మంచి సంబంధాలు ఉన్నాయి. ప్రిన్స్ ఛార్లెస్ 2003లో భారత్ పర్యటనకు వచ్చిన సమయంలో ముంబయిలో పర్యటించారు. ఆ సమయంలో ఆయన డబ్బావాలాలను కలుసుకొని వాళ్లు చేస్తున్న పనిని మెచ్చుకున్నారు.

2005 ఏప్రిల్‌లో ప్రిన్స్ ఛార్లెస్, కమిలా పార్కర్–బోవెల్స్ వివాహానికి హాజరుకావాల్సిందిగా డబ్బావాలాలకు రాజకుటుంబం నుంచి ఆహ్వానం అందింది. ఇప్పుడు ప్రిన్స్ హ్యారీ కోసం సంప్రదాయ పెళ్లి బహుమతులను కొనుగోలు చేసినట్లు ముంబయి డబ్బావాలా అసోసియేషన్ ప్రతినిధి సుభాష్ తాలేకర్ తెలిపారు. హ్యారీ కోసం కుర్తా–పైజామా, తలపాగా కొనుగోలు చేయగా మార్కెల్ కోసం అందమైన చీర, మంగళసూత్రం, ఆకుపచ్చ రంగు గాజులు కొన్నట్లు తాలేకర్ తెలిపారు. వాళ్లిద్దరి పెళ్లి సందర్భంగా ముంబయిలోని ప్రభుత్వ ఆసుపత్రుల్లో మిఠాయిలు పంచిపెట్టినట్లు ఆయన వెలవెల్లడించారు. ఈనెల 19న ప్రిన్స్ హ్యారీ–మేఘనా మార్కెల్ వివాహం వైభవంగా జరిగింది.



ప్రిన్స్ హ్యారీ–మేఘనా

## సాంకేతిక విద్యకి దిక్సూచి విఐటీ

### ఎంటెక్ ఇంటిగ్రేటెడ్ ,బిబిఏ అడ్మిషన్స్ ప్రారంభం

**రాజధాని వార్తలు, ఐనవోలు :** నవ్యాంధ్ర రాజధాని అమరావతిలో నెలకొల్పిన విఐటీ ఏపి లో మొదటి, రెండు విడతల కౌన్సిలింగ్ ముగిసింది.సాంకేతిక రంగంలో రోజు రోజు కి మారుతున్న టెక్నాలజీలకు అనుగుణంగా విఐటీ ఏపి రూపొందించిన కరిక్యులం ఆధారంగా డేటా ఏనాలటిక్స్, నెట్ వర్క్ సెక్యూరిటీ ,విఎల్ఎస్ఐ ,ఎంబెడ్ సిస్టం కోర్సులను దేశవ్యాప్తంగా ఉన్న విద్యార్థులు ఎంచుకున్నారని విఐటీ ఏపి వైస్ ప్రెసిడెంట్ డాక్టర్ శేఖర్ విశ్వనాధన్ చెప్పారు, పలు అంతర్జాతీయ విశ్వవిద్యాలయాలతో ఒప్పందాల్లో భాగంగా రెండు సంవత్సరాలు విఐటీ ఏపి లో మరో రెండు సంవత్సరాలు విదేశాల్లో విద్య అభ్యసించే అవకాశం ఉందని అందువల్ల ఉత్తర ,ఈశాన్య రాష్ట్రాల విద్యార్థులు విఐటీ ఏపి పై ఆసక్తి చూపారని అన్నారు.అదే విధంగా ప్రతిష్టాత్మకమైన యూనివర్సిటీ ఆఫ్ మిచిగాన్ తో కలిసి విఐటీ ఏపి బిజినెస్ అడ్మిన్ స్ట్రేషన్ లో బిబిఏ కోర్సును ఈ సంవత్సరం నుండి ప్రారంభిస్తున్నామని ,ఐఐఎం–అహ్మదాబాద్ పూర్వ ఆధ్యాపకుల అధ్వర్యంలో నడిచే ఈ కోర్సుని విద్యార్థులు తమకు నచ్చిన విధంగా మాడ్యుల్స్ ని ఎంచుకోవచ్చని , అదే విధంగా ఎంటెక్ ఐదేళ్ళ ఇంటిగ్రేటెడ్ కోర్సు కూడా విఐటీ ఏపి అందుబాటులో ఉందని ఇంటర్ ఎంపీసి లో 70 శాతం మార్కులు వచ్చిన వారు ఈ నెల 31 వరకు www.vitap.ac.in లో అప్లై చేసుకోవచ్చని ,బిబిఏ కి ఈ నెల 25 వరకు విఐటీ ఏపి వెబ్ సైట్ లో నమోదు చేసుకోవచ్చని విఐటీ ఏపి ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ డాక్టర్ సంధ్యా పెంటారెడ్డి తెలిపారు.

## ఈ నెల 29న కేరళ తీరాన్ని తాకనున్న రుతుపవనాలు

**రాజధాని ప్రతినిధి, విశాఖ :** ఈ నెల 29న కేరళ తీరాన్ని రుతుపవనాలు తాకే అవకాశం ఉందని భారత వాతావరణ శాఖ వెల్లడించింది. రుతుపవనాలు ప్రవేశించిన తర్వాత మొదటి పదిహేను రోజుల్లోనే దేశంలో సగం ప్రాంతాల్లో వర్షాలు కురిసే అవకాశం ఉందని తెలిపింది. జూన్ 1 నాటికి కేరళ దక్షిణ తీరంలోను, జులై మధ్య నాటికి దేశ వ్యాప్తంగాను వర్షాలు కురిసే అవకాశం ఉందని పేర్కొంది. భారత్ లో సోయాబీన్స్ ఎక్కువగా పండే ప్రాంతాల్లో జూన్ మూడో వారం నాటికి, పత్తి ఎక్కువగా పండే ప్రాంతాల్లో జులై మొదటి వారానికి వర్షాలు కురుస్తాయని వాతావరణ శాఖాధికారులు తెలిపారు.

## శ్రీదేవిది హత్యే

### మాజీ ఏసీపీ సంచలన వ్యాఖ్యలు




**న్యూఢిల్లీ :** అతిలోక సుందరి శ్రీదేవి అకాల మరణం చెంది మూడు నెలలు కావస్తున్నా ఆమె మృతిపై అనుమానాలు వీడలేదు. దుబాయ్‌లోని జుమేరా ఎమిరేట్స్ టవర్ హోటల్‌లో ఫిబ్రవరి 24న ప్రమాదవశాత్తు బాత్‌టబ్‌లో పడి శ్రీదేవి మరణించారు. మొదట శ్రీదేవి గుండెపోటుతో చనిపోయినట్టు కథనాలు వచ్చాయి. ఆ తర్వాత గుండెపోటుతో కాదు... స్పృహ కోల్పోయి హోటల్‌లో గదిలోని బాత్‌టబ్‌లో ప్రమాదవశాత్తు పడిపోవడం వల్ల ఆమె చనిపోయిందని, దీని వెనుక ఎలాంటి నేరపూరిత కారణం కనిపించడం లేదని దుబాయ్ పోలీసులు తేల్చారు. అయితే తాజాగా ఢిల్లీకి చెందిన వేద్ భూషణ్ అనే మాజీ అసిస్టెంట్ కమిషనర్ శ్రీదేవి మృతిపై వివాదాస్పద వ్యాఖ్యలు చేశారు. శ్రీదేవిని పక్కా ప్రణాళిక ప్రకారమే హత్య చేశారని ఆయన అన్నారు. బాత్‌టబ్‌లో బలవంతంగా ముంచి చంపడం చాలా సులువని, అలా చేస్తే మునిగి చనిపోయారని చెప్పి తప్పించుకునే అవకాశం ఉంటుందన్నారు. శ్రీదేవి ప్రమాదవశాత్తు చనిపోలేదని, ఆమెను పథకం ప్రకారం చంపేసిట్టు అనిపిస్తోందని ఆయన వ్యాఖ్యానించారు. దుబాయ్ డాక్టర్లు ఇచ్చిన ఫోరెన్సిక్ నివేదికపైనా ఆయన సందేహాలు వ్యక్తం చేశారు.

ఈ కేసులో ఇంకా చాలా విషయాలు తెలుసుకోవాలని ఆయన అన్నారు. ఏసీపీగా రిటైర్డ్ ఆయి ప్రస్తుతం ఢిల్లీలో ఓ ప్రైవేటు ఇన్వెస్టిగేషన్ ఏజెన్సీని నడుపుతున్న వేద్ భూషణ్ శ్రీదేవి మృతి చెందిన హోటల్‌కు వెళ్లారని, కానీ శ్రీదేవి మృతి చెందిన గదిలోని సిబ్బంది అనుమతించలేదని ఓ మీడియా సంస్థ పేర్కొంది. దీంతో అదే హోటల్‌లో వేరొక గదిలో ఉన్న ఆయన, శ్రీదేవి మరణానికి దారితీసిన పరిస్థితుల్లోనే మరణించారని సందేహం వ్యక్తం చేస్తూ.. స్వతంత్ర విచారణ చేపట్టాలని సునీల్ సింగ్ అనే వ్యక్తి సుప్రీంకోర్టులో పిటిషన్ దాఖలు చేశారు. ఒమన్‌లో శ్రీదేవి పేరిట ఉన్న రూ.240 కోట్ల ఇన్సూరెన్స్ పాలసీ ఆమె దుబాయ్‌లో మరణిస్తేనే సొమ్మును విడుదల చేస్తారని పిటిషనర్ తరపు న్యాయవాది కోర్టుకు నివేదించారు. అయితే ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ దీపక్ మిశ్రా నేతృత్వంలోని బెంచ్ మాత్రం ఈ పిటిషన్‌ను తిరస్కరించింది. ఇప్పటికే ఇలాంటి రెండు పిటిషన్లను నిరాకరించామని గుర్తు చేసింది.

## మళ్లీ మొదటికొచ్చిన ట్రంప్

- ఆయుధాలు వదలకపోతే వేటే
- ఉ. కొరియానేత కిమ్‌కు బెదిరింపు



**వాషింగ్టన్ :** అణ్వాయుధాలను వదిలిపెడితే ఉత్తరకొరియాకు రక్షణలు కల్పిస్తామని లేకపోతే దేశాధ్యక్షుడు కిమ్‌జాంగ్‌ఉన్‌ను పదవినుంచి తప్పిస్తామని, అవసరమనుకుంటే ఆయనను మరణం కూడా సంభవిస్తుందని అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ బెదిరించారు. అమెరికా, దక్షిణకొరియాలు కలిసి సైనిక విన్యాసాలను ప్రారంభించిన నేపథ్యంలో కిమ్ దక్షిణకొరియాతో సమావేశాన్ని రద్దు చేసుకుని, ట్రంప్‌తో జూన్ 12న సింగపూర్‌లో జరగనున్న శిఖరాగ్ర సమావేశాన్ని రద్దు చేసేందుకు కూడా తాము వెనుకాడబోమని కిమ్ ప్రకటించాడు. దీనిపైన ట్రంప్ స్పందిస్తూ సింగపూర్ సమావేశం జరుగుతుందనే భావిస్తున్నానని అయితే కొరియా ద్వీపకల్పాన్ని పూర్తి అణ్వస్త్ర రహితం చేయాలని ట్రంప్ కోరారు. తమవద్ద ఎలాంటి ఆయుధాలు లేకుండా పూర్తిగా ధ్వంసం చేయాలని ఏకపక్షంగా అమెరికా కోరితే లిబియాలో నాయకుడు గడ్డాఫీకి ఎదురైన అనుభవమే తనకు కూడా ఎదురుకావచ్చునని అందువల్ల ఏకపక్ష నిర్ణయాలు కుదరవని కిమ్ పేర్కొన్నారు.

లిబియా 2003లో అణ్వాయుధాల కార్యక్రమాన్ని రద్దు చేసింది. అనంతరం 2011లో జరిగిన సైనిక తిరుగుబాటు సందర్భంగా ఆయనను హత్యచేశారు. ఆయుధాలు వదిలిపెట్టక పోతే గడాఫీకి పట్టినగతే పడుతుందని ట్రంప్ మాట్లాడుతున్నారు. ఒప్పందం కుదుర్చుకోవాలని లేకపోతే తీవ్ర పరిమాణామాలు ఎదురవుతాయని ట్రంప్ పేర్కొన్నట్టుగా వైట్‌హౌస్ ఒక ప్రకటన జారీ చేసింది. ఆయుధాలను వదిలిపెడితే కిమ్‌కు అన్ని రకాలుగా భద్రత కల్పిస్తామని ట్రంప్ పేర్కొన్నారు. శిఖరాగ్ర సమావేశానికి సంబంధించి ఉత్తరకొరియా ఆలోచనలను చైనా ప్రభావితం చేస్తున్నదని ట్రంప్ ఆరోపించారు. మరోవైపు పెంటగాన్ ప్రతినిధి ధనావైట్ మాట్లాడుతూ ముందుగా ప్రకటించిన సైనిక విన్యాసాలలో ఎలాంటి మార్పు ఉండబోదని పేర్కొన్నారు. సైనిక విన్యాసాలు ఈ నెల 25వ తేదీతో ముగుస్తాయి. మూడు రోజుల క్రితమే ఇవి ప్రారంభ మయ్యాయి. సింగపూర్ సమావేశం జరుగుతుందన్న ఆశాభావాన్ని వైట్‌హౌస్ వ్యక్తం చేసింది.

Printed & Published by Pattan Hussain Khan, on behalf of M/s Vastitude Media Pvt. Ltd., and Printed at M/s Jagati Publications Ltd., Sakshi Press, Survey No. 766/2, Ankireddy Palem Village, Guntur Rural, 522005, Guntur Distt. A.P. and Published at 6-45/1, Rayapudi, Thullur Mandal, Guntur Distt, Andhra Pradesh-522237. Editor: Pattan Hussain Khan, RNI NO: APTEL/2015/66622, Postal Regd No: GTR/84/2016-18, Cell 9440662699, Email : rajadhanivartalu1@gmail.com